ఈనాడు ఆదివారం

26 అక్టోబరు 2025



ఏఐని... ఆ ఐదూ అడగొద్దు!



విటమిన్-సి... చలికాలంలో శ్రీరామ రక్ష!



(c) eenadu

మా ఇంట్లో ఏసీ ఉండదు!

గూగుల్, మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్... నిత్యం ఈ టెక్ దిగ్గజాలతో పోటీపడుతుంటారు శ్రీధర్ వేంబు. తాజాగా 'అరట్టై'తో వాట్సాప్‌కీ సవాలు విసిరి... 'మెటా'తోనూ ఢీ అంటే ఢీ అంటున్నారు! ఆయన సంపద కూడా ఆ స్థాయిలోనే ఉంది... రూ.50 వేల కోట్ల రూపాయలు మరి! ఈ విజయాలన్నింటినీ తమిళనాడులోని ఓ మారుమూల పల్లెటూరిలో ఉంటూనే సాధిస్తున్నారాయన. మన దేశంలో సరికొత్త ఐటీ విప్లవానికి నాంది పలికిన శ్రీధర్ వేంబుతో చేసిన అరట్టై(పిచ్చాపాటి)లోని కొన్ని విశేషాలివి...



పల్లెలంటే ప్రాణం!

మా నాన్నావాళ్లది తంజావూరులోని ఒళిగచ్చేరి అనే కుగ్రామం. కావేరి ఉపనది కొల్లిడం ప్రవహించే పల్లెకాబట్టి... పచ్చదనంతో నిండి ఉండేది. నాకు ఎప్పుడు సెలవులొచ్చినా ఈ ఊరికి వచ్చేసేవాణ్ణి. సెలవులు అయిపోయాక తిరిగి వెనక్కి వెళ్ళనని మొండికేసేవాణ్ణి. ఏడ్చి గీపెడుతున్న నన్ను బలవంతంగా తీసుకొచ్చి బస్సెక్కించేవారు. ఆ ఊరి గుర్తుగా ఏ రాయో రప్పో తెచ్చుకుని... దాచుకునేవాణ్ణి. ఆ ఊరిపైన నాకున్న మమకారమే జోహో కంపెనీని గ్రామీణ ప్రాంతాలకి తెచ్చేలా చేసింది!

మూడున్నరవేల రూపాయలతోనే...

మా నాన్న సాంబమూర్తి వేంబు మద్రాసు హైకోర్టులో స్టెనోగా చేసేవారు. అప్పట్లో ఆయన జీతం రూ.3500! ఆ అత్తెసరు ఆదాయంతోనే మా అమ్మ కన్మణి మమ్మల్నందర్నీ పెంచింది. నేను చిన్నప్పటి నుంచీ స్కాలర్‌షిప్‌లతోనే చదువుకున్నాను. చిన్నప్పుడు అమ్మ నేర్పిన పొదుపు, నిరాడంబర జీవనం నా జీవిత విధానంగా మారిపోయాయి.

ఓనమాలు దిద్దాను...

ఐఐటీ-మద్రాసులో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేశాక... అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ముగించాను. ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. మంచి జీతం... బంగ్లా కూడా ఇచ్చారు. అక్కడితో మా కుటుంబ కష్టాలన్నీ తీరిపోయేవే కానీ... నాకు అధ్యాపకవృత్తి సరిపోదనిపించింది. బయటకొచ్చేశాను. నాకే మాత్రం అర్థంకాని సాఫ్ట్‌వేర్ నైపుణ్యాల్లో ఓనమాలు నేర్చుకున్నాను. క్వాల్‌కమ్ సంస్థలో ఉద్యోగినయ్యాను. చిన్నకంపెనీల అవసరాలని తీర్చే సాఫ్ట్‌వేర్‌లని అందించాలని... 'అడ్వెంట్ నెట్ కంపెనీ'ని ప్రారంభించాను.

పేరులో ఏముంది..?

మా సంస్థ లక్ష్యం చిన్న కంపెనీలే కాబట్టి 'అడ్వెంట్ నెట్' అన్న పేరుని... స్మాల్ ఆఫీస్ హోమ్ ఆఫీస్(సోహో) అని మార్చుకున్నాం. విభిన్నంగా ఉండాలని 'ఎస్'ని కాస్తా జెడ్‌గా మార్చి 'జోహో'గా చేశాం!

వాడి కోసం...

మా అబ్బాయి పేరు సిద్ధు. వాడికి రెండేళ్లు ఉన్నప్పుడు ఆటిజం ఉందని తెలిసింది. దాంతో నేనూ నా భార్య ప్రమీల తీవ్ర మానసిక క్షోభని అనుభవించాం. చిన్నప్పుడు నేను చూసిన పల్లెటూరి వాతావరణం వాడికి మేలు చేస్తుందని బలంగా నమ్మాను. నేను గ్రామీణ ప్రాంతాల్లోనే జీవించాలని నిర్ణయించుకోడానికి అదీ ఓ కారణమని చెప్పాలి!

పల్లెటూరి సత్తా అది!

మనం వాడుతున్న చాటింగ్, ఈమెయిల్ ఆప్‌లు అమెరికావి! నాకో దశలో... మన డేటా అంతటినీ వాళ్లు మనకి వ్యతిరేకంగా వాడితే ఎలా అన్న భయం కలిగింది. అందుకే మనదైన ఈమెయిల్ రూపొందించాలని... జోహోమెయిల్‌ని ప్రారంభించాను. 'వాట్సాప్'కి ప్రత్యామ్నాయంగా అచ్చమైన తమిళపదంతో 'అరట్టై'ని మొదలుపెట్టాను. మన పల్లెటూరి యువతే వీటికోసం పనిచేశారు. ఎనిమిదేళ్ల తర్వాత... వాటికి ఇప్పుడు లక్షల డౌన్‌లోడ్‌లు వస్తుండటం చూస్తే ఆనందంగా ఉంది!

ఫోర్కులు ఎందుకు?

చెన్నైలో ఆఫీసు పెట్టిన కొత్తల్లో అక్కడున్న ఎగ్జిక్యూటివ్‌లూ ఉద్యోగులూ ఫోర్క్‌తో తినకపోతే చిన్నచూపు చూసేవాళ్లు. మన పద్ధతుల్ని కించపరచడం నాకు నచ్చలేదు. అందుకే, గ్రామీణ ప్రాంతాల్లో... పల్లెటూరి యువతతోనే సంస్థను నడిపి విజయం సాధించాలనుకున్నాను. 'స్పోక్స్ అండ్ హబ్' పేరుతో పల్లెటూళ్ళలో కంపెనీ శాఖల్ని ఏర్పాటుచేశాను. మొదట తమిళనాడు తెన్కాశిలోని మత్తలంపాళయానికి దగ్గర్లో ఉన్న సిల్లరైపురవు అనే ఊళ్లో ఆఫీసును ప్రారంభించి... నేనూ అక్కడే ఉండిపోయాను.

చాపమీదే...

తెన్కాశికి దగ్గర్లో చిన్న ఇంట్లోనే ఉంటాను. చాపమీదే పడుకుంటాను. మా ఇంట్లో ఫ్యాన్ తప్ప ఏసీ ఉండదు. తెల్లవారుజామున నాలుగింటికే నిద్రలేస్తాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎగ్జిక్యూటివ్‌లతో మాట్లాడాక... సైకిల్ మీద పొలానికి వెళ్లి పనుల్ని చూస్తుంటాను. ఊళ్లోని పిల్లలతో కలిసి చెరువులో ఈత కొడతాను. పనిమీద తెన్కాశి పట్టణానికి వెళ్లాలంటే నేనే ఎలక్ట్రిక్ ఆటో నడుపుకుంటూ వెళతాను.



(c) eenadu

లోపల







మంచిమాట

చిత్తశుద్ధి అంటే- ఎవరూ నిన్ను గమనించకపోయినా సరైన రీతిలో ప్రవర్తించడమే.

మీకు రెండూ లేవు

భర్త: సుశీ, నీకు అందమైన అబ్బాయిలంటే ఇష్టమా? లేక తెలివైన వాళ్లంటే ఇష్టమా?

భార్య: అందమైన వాళ్ళకూ తెలివైన వాళ్ళకూ పొగరు ఎక్కువ ఉంటుంది. అలాంటివాళ్ళంటే నాకు ఇష్టం ఉండదు. నాకు మీరంటేనే ఇష్టం.

అలాగా!



108 నామాలు జపం చేయమంటే మనసు ఎక్కడెక్కడో తిరుగుతుంది, 500 నోట్ల కట్ట లెక్కపెట్టమంటే, మనసుకి ఎక్కడలేని ఏకాగ్రతా వస్తుంది... అదేంటో మరి!

మీ వెన్నెముకే మీ బలం!

వెన్ను నొప్పి రాకుండా ఆరోగ్యంగా ఉండడం ఎలా?

మన జీవన విధానంలో చేసుకునే చిన్న చిన్న మార్పులతో, మెడ, వెన్నెముక సమస్యలని చాలా మటుకు నివారించవచ్చు కానీ, దాని మీద అవగాహన, సమయానికి వైద్య సహాయం చాలా కీలకం.

ఇవాళ వెన్ను, మెడ నొప్పి అనేది సర్వ సాధారణమైపోయింది. ఇదొక కొత్త 'లైఫ్‌స్టైల్ డిసీజ్' లాగా చూస్తున్నారు. స్కూల్ పిల్లలు బరువైన బ్యాగ్‌లతో తిరగడం నుంచి, ఆఫీసుల్లో గంటల కొద్దీ కూర్చునే వాళ్లు, పొలాల్లో కష్టపడే రైతులు, బరువులు మోసే కూలీలు, ఇంటి పనులు చేసుకునే మహిళలు, అందరూ ఏదో ఒక దశలో వెన్నునొప్పిని అనుభవించినవాళ్లే. కానీ చాలామందికి తెలియని విషయం ఏంటంటే, దాదాపు 80% వెన్ను సమస్యలని, మన జీవన విధానంలో, చిన్న చిన్న మార్పులతో, సమయానికి సరైన చికిత్సతో, చాలా సులభంగా నివారించవచ్చు

మీ జీవితాన్ని నిలబెట్టే బలమైన వెన్నెముక

వెన్నంటే అన్ని ఎముకల్లాంటిది కాదు. మన శరీరం మొత్తాన్ని నిలబెట్టి, వెన్నెముకకి ఊతమిచ్చే మూలస్తంభం. ఇది మన శరీరంలోని అన్ని భాగాలని మెదడుతో కనెక్ట్ చేస్తుంది.

దీని మీద ఎటువంటి గాయమైనా, డిసార్డర్ అయినా, అది మన నడక, కదలిక, బ్యాలెన్స్, రోజువారీ పనులు, కొన్ని సార్లు అవయవాల పనితీరు మీద కూడా ప్రభావం చూపిస్తుంది.

స్పాండిలోసిస్ లక్షణాలు : నడుము నొప్పి, సయాటిక, మెడనొప్పి, చెయ్యి లాగడం, కళ్ళు, చేతులు తిమ్మిర్లు రావడము, ఎక్కువసేపు నిలబడలేకపోవడం, త్వరగా కూర్చోవాల్సి రావడము, కండరాల కదలికలు & కాళ్ళు చేతులు బలహీనపడటము, మలమూత్రముల సమస్యలు.

సరైన చికిత్సా విధానం: ఈ రోజుల్లో స్పైన్ ట్రీట్మెంట్ చాలా ఖచ్చితత్వంతో, పేషెంట్‌కి సౌకర్యంగా ఉండేలా డిజైన్ చేశారు.

మందులు, ఫిజియోథెరపీ, షుగర్ కంట్రోల్, పోస్ట్ మెనోపాజ్ మహిళలకు / వృద్ధులకు క్యాల్షియం సప్లిమెంట్స్, లైఫ్‌స్టైల్‌లో మార్పులు, బరువు కంట్రోల్, ఆరోగ్యకరమైన ఆహారంతో చాలామంది పూర్తిగా కోలుకుంటారు.

manipalhospitals LIFE'S ON

Dr. RAVIKANTH VUPPU



Consultant
Neuro and Spine Surgery
Manipal Hospitals
Vijayawada

తీవ్రమైన కేసుల్లో మాత్రమే సర్జరీ అవసరం అవుతుంది. ఉదాహరణకు, ఇతర చికిత్సలకు స్పందించనంత తీవ్రమైన నొప్పులు, నర్వ్ కంప్రెషన్ వల్ల బలహీనత, యూరిన్ / బొవెల్ కంట్రోల్ లోపం, వెన్నులో అస్థిరత, ట్యూమర్లు లాంటి తీవ్రమైన పరిస్థితులు. అలాంటప్పుడు కూడా ఎండోస్కోపిక్ డిస్కెక్టమీ, ఆర్టిఫిషియల్ డిస్క్ రీప్లేస్‌మెంట్ (దెబ్బతిన్న డిస్క్‌ను కొత్తదానితో మార్చడం), పర్క్యూటేనియస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నిక్స్ వంటి మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలతో నయం చేయొచ్చు. ఇవి చిన్న గాటు (గాయం), తక్కువ నొప్పి, వేగవంతంగా కోలుకునేలా చేస్తాయి. అందుకే ఈ సర్జరీల తరువాత, చాలా త్వరగా తమ పనిని తిరిగి మొదలుపెట్టవచ్చు. భవిష్యత్తులో రోబోటిక్స్ టెక్నాలజీ వలన ఈ సర్జరీలు ఇంకా సులభంగా, నొప్పి లేకుండా జరిగే అవకాశం ఉంది.

ఆరోగ్యకరమైన అలవాట్లు : సరిగ్గా కూర్చోవడము, ఏకధాటిగా (45 నిమిషాలు) కూర్చోకుండా వుండటం, వ్యాయామము, బరువులు ఎత్తకుండా వుండటం, గట్టి పరుపు మీద పడుకోవటం, బరువు తగ్గడము

అపోహలు... తప్పులు: మెడ లేదా నడుము నొప్పి చిన్నదైతే చాలా మంది పట్టించుకోరు. 'ఆ... అదే తగ్గిపోతుందిలే' అని అనుకుంటారు. ఇంకొంత మంది నొప్పికి కారణం తెలుసుకోకుండా, తగ్గేందుకు మందులు, మసాజ్‌ల మీద ఆధారపడతారు. వెన్ను సమస్యలు పెద్ద వారిలోనే వస్తాయని, డిస్క్‌కి ఆపరేషన్ తప్పనిసరేనని అపోహలు ఉన్నాయి.

చివరిగా...

మీ వెన్నెముక ప్రతి క్షణం మిమ్మల్ని మౌనంగా సపోర్ట్ చేస్తూనే ఉంటుంది. నిలబడటం, కూర్చోవటం, వంగటం, ఆఖరికి ఊపిరి పీల్చటం కూడా దాని మీదే ఆధారపడి ఉంటాయి. అది మీకు వార్నింగ్ ఇచ్చే లోపే దాన్ని జాగ్రత్తగా చూసుకోండి.

ఆరోగ్యకరమైన వెన్నెముక అంటే ఎవ్వరిమీదా ఆధారపడని చురుకైన, స్వతంత్ర జీవితం.

ఒక్కటి గుర్తు పెట్టుకోండి. శస్త్ర చికిత్స కన్నా నివారణే ఎప్పుడూ మంచిది. (Prevention is always better than operation).

రచయిత: డా. రవికాంత్ ఉప్పు, కన్సల్టెంట్ న్యూరో & స్పైన్ సర్జన్, మణిపాల్ హాస్పిటల్స్, విజయవాడ.

ADVERTISEMENT

(c) eenadu



పంచభూతలింగ క్షేత్రాల్లో ఇదీ ఒకటి. స్వామివారి అర్చనకు చీరకట్టుతో వచ్చే పూజారి, గురుశిష్యులుగా పూజలు అందుకునే శివపార్వతులు, శ్రీచక్రాన్ని లోలాకులుగా ధరించిన జగన్మాత... ఇలాంటి ఎన్నో విశేషాలు తమిళనాడులోని జంబుకేశ్వరంలో కనిపిస్తాయి.

ఇక్కడ శివపార్వతులకు కల్యాణం ఉండదు!

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశాన్ని కలిపి పంచభూతాలుగా పిలుస్తారు. ఆ పంచభూతాలకు ప్రతీకగా పరమేశ్వరుడు అయిదుచోట్ల కొలువుదీరిన ఆలయాలే పంచభూత క్షేత్రాలు. వాటిలో జంబుకేశ్వరం రెండోది. ఇక్కడ మహాదేవుడు జలలింగం రూపంలో పూజలు అందుకుంటున్నాడు. తమిళనాడు, తిరుచిరాపల్లిలోని శ్రీరంగానికి దగ్గరగా ఉండే ఈ ఆలయంలో పరమేశ్వరుడు జంబుకేశ్వరుడిగా, పార్వతీదేవి అఖిలాండేశ్వరిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు.

స్థలపురాణం

పూర్వం ఇక్కడ తెల్లనేరేడు వృక్షాలు ఎక్కువగా ఉండటం వల్లే ఈ ప్రాంతానికి జంబుకేశ్వరం అనే పేరు వచ్చిందట. ఒకప్పుడు ఈ పరిసరాల్లో శంభుడు అనే రుషి ఉండేవాడు. పరమేశ్వరుడిని పూజించనిదే పచ్చి గంగను కూడా స్వీకరించేవాడు కాదు. ఓసారి శంభుడికి శివుడిని ప్రత్యక్షంగా పూజించాలనే కోరిక కలిగింది. స్వామి అనుగ్రహం కోసం తపస్సు చేశాడు. ఆ భక్తికి మెచ్చిన ముక్కంటి కట్టెదుట సాక్షాత్కరించడంతో తన మనసులోని మాటను చెప్పాడు. అప్పుడు శివుడు, త్వరలోనే తానీ ప్రాంతంలో వెలుస్తానని చెప్పి అంతర్ధానమయ్యాడు. మాటిచ్చినట్టుగానే, కొన్నాళ్లకు ఇక్కడ జలలింగంగా ఆవిర్భవించడంతో... శంభుడు జంబు వృక్షంగా మారి స్వామిని అర్చించడం ఆరంభించాడు. అందుకు నిదర్శనంగా ఈ ఆలయ ప్రాంగణంలో నేటికీ తెల్లనేరేడు వృక్షాన్ని చూడొచ్చు. మరో కథ ప్రకారం శ్రీకాళహస్తిని తలపించేలా... ఇక్కడా స్వామిని ఏనుగు, సాలీడు పోటీపడి పూజించడంతో శివుడు స్వయంభువుగా అవతరించి వాటికి మోక్షాన్ని ప్రసాదించాడట. ఇక, శివపార్వతుల్ని గురుశిష్యులుగా భావించడం వెనుకా ఓ కథ ఉంది. పరమేశ్వరుడు లోకకల్యాణం కోసం తపస్సు చేస్తున్నప్పుడు, పార్వతీదేవి ఆటపట్టించేందుకు ప్రయత్నించిందట. దీంతో స్వామి ఆగ్రహించి భూలోకానికి వెళ్లి సాధారణ మహిళలా జీవితం గడపమంటూ శపించాడట. శైలజ తన తప్పును తెలుసుకుని క్షమించమని వేడుకోవడంతో, కావేరీనది ఒడ్డున తపస్సు చేయమని సూచించాడట. అలా అమ్మవారు ఈ ప్రాంతానికి వచ్చి లింగాన్ని తయారుచేసి పూజించిందట. ఆమె భక్తికి మెచ్చిన ఈశ్వరుడు గురువుగా ప్రత్యక్షమై జ్ఞానబోధ చేశాడట. ఆ గురుశిష్య బంధం కారణంగానే ఇక్కడ శివపార్వతుల కల్యాణం నిర్వహించే సంప్రదాయం లేదు.

శ్రీచక్ర లోలాకులు

తిరువానైక్కావల్‌గానూ పిలిచే ఈ ఆలయాన్ని కోచెంగనాన్ అనే చోళరాజు నిర్మించాడట. ఏడు అంతస్తుల రాజగోపురంతో భక్తులను స్వాగతించే ఈ ఆలయంలో... మొత్తం అయిదు ప్రాకారాలు ఉన్నాయి. వాటిలో ఒకదాని నిర్మాణానికి స్వయంగా ఆ సదాశివుడే సాయం చేశాడట. అందుకే దాన్ని విభూతి ప్రాకారంగా పిలుస్తారు. ఈ ఆలయంలో శివపార్వతులు ఎదురెదురుగా కొలువై దర్శనమిస్తారు. అంటే... జంబుకేశ్వరుడు పశ్చిమాన ఉంటే, అఖిలాండేశ్వరి స్వామికి ఎదురుగా తూర్పుదిక్కున కనిపిస్తుంది. అలాగే, అమ్మవారికి ఎదురుగా వినాయకుడి ఉపాలయం ఉంటుంది. పరమేశ్వరుడు జలలింగంగా పూజలు అందుకుంటున్నా శివలింగం నీటిలో ఉండదు. అయితే, పానవట్టంపైన ఏడాదంతా నీటి ఊట కనిపిస్తుంది. ఇక, ఆ శక్తిస్వరూపిణి అఖిలాండేశ్వరిగా చతుర్భుజాలతో నిల్చుని మరీ దర్శనం ఇస్తుంది. అమ్మవారి ఉగ్రరూపాన్ని శాంతింపచేయడానికి ఆదిశంకరుడు ఇక్కడ శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించడమే కాక, అమ్మవారికి శ్రీచక్ర కర్ణాభరణాలనూ అలంకరించాడట. అమ్మవారి ఎదురుగా వినాయక విగ్రహాన్నీ ప్రతిష్ఠించడంతో, దేవి మరింత శాంతస్వరూపిణిగా మారిందట. రోజూ మధ్యాహ్నం అఖిలాండేశ్వరి ఆలయ పూజారి మహిళలా అలంకరించుకుని పరమేశ్వరుడిని పూజించేందుకు స్వామి సన్నిధికి వస్తాడు. ఇక్కడ బ్రహ్మోత్సవాలు, వసంతోత్సవాలతో పాటు కార్తికమాసం, మహాశివరాత్రి తదితర ప్రత్యేక సందర్భాల్లో జరిగే విశేష పూజా కార్యక్రమాలను చూసి తీరాల్సిందే. ఈ ఆలయానికి విమానంలో రావాలనుకునే భక్తులు తిరుచిరాపల్లి విమానాశ్రయంలో దిగితే సరిపోతుంది. అక్కడినుంచి చేరుకునేందుకు బస్సులూ, ప్రైవేటు వాహనాలూ ఉంటాయి. రైల్లో రావాలనుకుంటే, ఆలయానికి దగ్గరగా ఉండే శ్రీరంగం రైల్వేస్టేషన్‌లో దిగాల్సి ఉంటుంది. ★



(c) eenadu

ఆ ఆలయంలో వృథా ఉండదు!



గుడులకి ఎంత భక్తిపూర్వకంగా వెళ్లినా... కొన్ని విషయాలు మనల్ని ఇబ్బంది పెడుతూనే ఉంటాయి. ఎక్కడంటే అక్కడ సగం తిని విసిరేసే ప్రసాదాలు, పడేసే పువ్వులూ, కొబ్బరి చిప్పలూ, నిమ్మకాయలూ... ఇవన్నీ కుళ్లిపోయి పడి ఉంటాయి. ఈ పరిస్థితికే ఓ వినూత్న పరిష్కారాన్ని చూపిస్తోంది 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రౌండ్‌టేబుల్' అనే సంస్థ. బెంగళూరులోని ప్రఖ్యాత బనశంకరి ఆలయంలో- భక్తులు వృథాగా పడేసిన పూలమాలల్ని అక్కడికక్కడే రీసైక్లింగ్ చేసి ఎరువుగా మార్చి పెరటి తోటలకి ఉచితంగా అందిస్తోంది. అమ్మవారికి భక్తులు సమర్పించే నిమ్మకాయ దీపాల్నీ, బెల్లాన్నీ ప్రత్యేక పరికరం ద్వారా బయో ఎంజైమ్‌గా మారుస్తోంది. ఫినాయిలూ యాసిడ్ వగైరాలూ వాడకుండానే గుడి మొత్తాన్నీ ఈ సహజ ఎంజైమ్‌లతోనే శుభ్రం చేస్తోంది! ముఖ్యంగా ఇక్కడ ప్రసాదంగా అందించే ఉప్పుని... పక్కనున్న కొబ్బరి రైతులకి అందిస్తోంది. ఈ సంస్థ చర్యలతో కేవలం నాలుగునెలల్లోనే కర్ణాటకలోని అతిశుభ్రమైన గుడుల్లో ఒకటిగా పేరుతెచ్చుకుంది బనశంకరి ఆలయం. బావుంది కదా!





వరాహ రూపం... అమెరికాలో!

'కాంతార' చిత్రాలు చూసినవాళ్లందరికీ 'పంజుర్లి' అంటే తెలిసే ఉంటుంది. 'వరాహ రూపం' అంటూ మొదలయ్యే ఆ పాపులర్ పాట వర్ణించేది కూడా ఆ రూపాన్నే. పంజుర్లి అంటే తుళు భాషలో 'వరాహదేవత వారసుడు' అని. ఏడాదికోసారి 'భూతకోల' ఉత్సవం సమయంలో దైవంగా వేషం ధరించేవాళ్ల ముఖాన్ని ఈ పంజుర్లి రూపంలోనే తీర్చిదిద్దుతారు! అది కాకుండా పంజుర్లి రూపాలు గుడుల్లోనే ఉంటాయి. అలాంటి పంజుర్లి ఒకటి సుమారు పాతికేళ్ల కిందట అమెరికా వెళ్లిందట. ఎవరో ధనవంతుడి దగ్గరున్న దాన్ని... అక్కడి నేషనల్ మ్యూజియం ఆఫ్ ఏషియన్ ఆర్ట్ సంస్థ సేకరించింది. 1999 నుంచీ దాన్ని ప్రదర్శనలో ఉంచింది. అప్పుడు దాన్నెవరూ పెద్దగా పట్టించుకోలేదుకానీ... 'కాంతార' చిత్రాలు ఇప్పుడు ఆ పరిస్థితిని మార్చేశాయట! ఈ మధ్య ఆ చిత్రం ప్రీక్వెల్ విడుదలైన తర్వాత వీకెండ్స్‌లో ప్రవాస భారతీయులు... మునుపెన్నడూ లేనివిధంగా ఈ మ్యూజియానికి వరస కడుతున్నారట. దాంతో దీనికోసమంటూ ప్రత్యేక స్టాండ్‌నీ ఏర్పాటుచేసి... ప్రచారమూ చేపట్టిందా మ్యూజియం!

మినీ ఇజ్రాయెల్!

ఇజ్రాయెల్‌లో ఓ పద్ధతి ఉంది... 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడూ రెండు సంవత్సరాలు సైన్యంలో పనిచేయాలి. ఆ శ్రమ కారణంగానేమో అక్కడి యువత... ఆ రెండేళ్ల తర్వాత విదేశీ పర్యటనలకి వెళుతూ ఉంటారు. అలా ఎంతోమంది కొన్ని దశాబ్దాలుగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్నే తమ గమ్యంగా ఎంచుకుంటున్నారట! అక్కడి చల్లటి వాతావరణం... యోగా శిక్షణ కేంద్రాలు ఎక్కువగా ఉండటం ఇందుకు కారణంగా చెబుతారు. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లోని కసోల్, ధర్మకోట్ ప్రాంతాలు ఇజ్రాయెల్ దేశస్థుల నెలవుగా మారాయి. ఏటా ఈ రెండు ప్రాంతాలకీ లక్షమంది ఇజ్రాయెలీలు వస్తారని ఓ అంచనా! ధర్మకోట్‌లో సుమారు రెండువేలమందిదాకా శాశ్వత నివాసమూ ఏర్పరచుకున్నారు. ఆ రకంగా ఇక్కడ స్థానికులకన్నా ఇజ్రాయెలీల సంఖ్యే ఎక్కువంటున్నారు. దాంతో అటు కసోల్ ఇటు ధర్మకోట్ రెండూ ఓ చిన్నసైజు విదేశీ నగరాలనే తలపిస్తున్నాయి. ముఖ్యంగా ధర్మకోట్‌లో స్థానికులకన్నా పర్యటకుల అభిరుచులకి తగ్గట్టే రోడ్లనీ హోటళ్లనీ తీర్చిదిద్దారు. ఇక్కడి రెస్టరంట్‌లన్నీ ఇజ్రాయెలీలు ఇష్టంగా తినే షక్‌షుకా, ఫ్లాఫల్, హమ్మూస్ వంటి పదార్థాలనే చేస్తున్నాయి. స్థానికులూ హిబ్రూ భాషనే మాట్లాడతారు... హోటల్స్‌లోని మెనూలు కూడా ఆ భాషలోనే ఉంటాయి! అందుకే ప్రస్తుతం కసోల్ ప్రాంతాన్ని 'మినీ ఇజ్రాయెల్' అంటుంటే... ధర్మకోట్‌ని మినీ టెల్ అవీవ్(ఇజ్రాయెల్ రాజధాని) అనీ పిలుస్తున్నారు.





పరిశోధన

తెల్లజుట్టు నల్లగా...


ఒకసారి జుట్టు నెరిసిపోతే ఆ జుట్టు మళ్లీ నలుపురంగులోకి మారడం సాధ్యమేనా? సాధ్యమే అంటున్నారు అమెరికాలోని న్యూలండన్ ఆసుపత్రికి చెందిన శాస్త్రవేత్తలు. అవును, కొంతమందికి చిన్నవయసులోనే వెంట్రుకలు తెల్లగా మారుతున్నాయి. దాంతో రసాయనాలున్న రంగులని వాడాల్సిన పరిస్థితి. అసలు చిన్న వయసులోనే జుట్టు ఇలా రంగు మారడం వెనుక కారణాన్ని వీళ్లు కనిపెట్టారు. జుట్టు కుదుళ్లలో ఉండే మెలనోసైట్ స్టెమ్‌సెల్స్ అనేవి మన వెంట్రుకలకి నల్ల రంగుని అద్దుతాయి. మన వయసు



పెరుగుతున్నప్పుడు అవి కూడా చనిపోతూ వస్తాయి. దాంతో మన జుట్టు తెల్లబడుతుంది. అలాకాకుండా చిన్న వయసులో కూడా వెంట్రుకలు తెల్లబడటానికి కారణం... కొన్ని సందర్భాల్లో ఈ మెలనోసైట్ స్టెమ్‌సెల్స్ కుదుళ్ల దగ్గర జామ్ అవుతుండటమే. ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్న వాహనం ఎలా ముందుకెళ్లదో, అలా ఇక్కడా కణాలు చిక్కుకుపోయి సమయానికి నలుపురంగుని సరఫరా చేయలేకపోతాయి. ఆ ట్రాఫిక్‌జామ్‌ని క్లియర్ చేసి కణాల సరఫరాని యథాతథంగా జరిగేట్టు చేస్తే, జుట్టుని నలుపు రంగులోకి మార్చవచ్చంటున్నారు శాస్త్రవేత్తలు. రెండేళ్లపాటు ఎలుకల పైన చేసిన ప్రయోగాలు విజయవంతం అయ్యాయట కూడా.

పుస్తకం తోడుంటే..

వయసు పెరిగేకొద్దీ మతిమరుపు రావడం, మాటలో తడబాటు, చురుకుదనం తగ్గడం సహజం కదా! అయితే... 90 ఏళ్లు దాటినా కాగ్నిటివ్ స్కిల్స్‌ని తగ్గకుండా చేసే ఓ చక్కని పరిష్కారం కనిపెట్టారు ఫిన్‌ల్యాండ్‌లోని హెల్సింకీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. అదేంటో తెలుసా? వీలైనంత ఎక్కువగా చదువుకోవడమేనట. అవును, చదువు- వృద్ధాప్యంలో మెదడు పనితీరు మందగించకుండా చేసే ఒక రక్షణ కవచంలా ఉంటుందట. ఇందుకోసం... 90 నుంచి 97 ఏళ్ల మధ్య వయసు వాళ్లని 50 ఏళ్లపాటు అధ్యయనం చేశారు. వీళ్లలో 12 ఏళ్లూ, అంతకంటే ఎక్కువకాలం చదువుకున్నవాళ్లలో- తక్కువ చదువుకున్న వారితో పోల్చినప్పుడు మతిమరుపు సమస్యలు కానీ, భాషాపరమైన ఇబ్బందులు కానీ ఎదురవలేదు. మధ్యలో బీపీ వంటి గుండెజబ్బులు ఎదురైనా... చదువుకున్న వారు 95 ఏళ్ల తర్వాత కూడా చురుగ్గానే ఉన్నారట. ఒక్క నిమిషంలో వేగంగా సమాధానాలు కోరే 'సెమాంటిక్ ఫ్లుయెన్సీ' టెస్ట్, చెప్పిన విషయంలో ఎన్ని పదాలు గుర్తుపెట్టుకున్నారో తేల్చే 'ఇమ్మీడియెట్ రీకాల్' టెస్ట్ వంటివాటిని పెట్టినప్పుడు ఎక్కువకాలం చదువుకున్నవాళ్లు చురుగ్గా ఉంటూ, మెరుగైన ఫలితాలని చూపించారట. అందుకే వయసుతో సంబంధం లేకుండా ఏదో ఒక పుస్తకాన్ని చేతపడితే వృద్ధాప్య సమస్యలని జయించడం తేలిక అంటున్నారు శాస్త్రవేత్తలు.



వయసు పెరిగితే ఇబ్బందే...


ఆడవాళ్లలో వయసు పెరిగితే అండాల సంఖ్య తగ్గుతూ సంతాన సాఫల్యత తగ్గుతుంది. ఇది మనకు తెలిసిన విషయమే! మరి మగవాళ్లలో ఎలాంటి మార్పులు వస్తాయి... అనే దిశగా లండన్‌లోని కింగ్స్ కాలేజీ, యూకే ట్విన్స్ సంస్థలు కలిసి ఒక అధ్యయనం చేశాయి. మగవాళ్లలో వయసు పెరుగుతున్నకొద్దీ వీర్యకణాల కదలికలో వేగం మందగించడం, వాటి సంఖ్య తగ్గిపోవడం జరుగుతుంది. వాటికితోడు 'డీఎన్‌ఏ ఎర్రర్స్' అనేవి కూడా తలెత్తుతాయట. అంటే జీవనశైలిలో వచ్చిన మార్పులూ, పెరుగుతున్న వయసు కారణంగా వీర్యకణాల్లో 'ఆక్సిడేటివ్ స్ట్రెస్' అనేది ఏర్పడుతుంది. దాంతో కణవిభజన సమయంలో కణం నుంచి కణానికి డీఎన్‌ఏ మ్యుటేషన్స్ జరిగినప్పుడు కొన్ని పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. అలా, అలా... పొరపాట్లన్నీ ఏకమై అవే 'డీఎన్‌ఏ ఎర్రర్స్'గా మారి



చాలాసార్లు గర్భస్రావానికి దారితీయడం, పుట్టబోయే పిల్లల్లో ఎదుగుదల లోపాలు ఏర్పడటం, మరికొన్నిసార్లు ప్రాణాంతక క్యాన్సర్లు వంటివి రావడం కూడా జరగొచ్చట. అదే చిన్నవయసువారిలో అయితే ఈ డీఎన్‌ఏ ఎర్రర్స్ అనేవి చాలా తక్కువగా ఉండి, పిల్లల్లో ఇలాంటి అనారోగ్యాలు వచ్చే సమస్య తక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మందులు అవసరం లేదిక!

డయాబెటిస్ ఉన్నవారు... జీవితాంతం మందులు వాడాలి, లేదంటే ఇన్సులిన్‌పైన ఆధారపడాలి. వాటి అవసరం లేకుండా స్వీడన్, అమెరికా శాస్త్రవేత్తలు... క్రిస్పర్ టెక్నాలజీని వాడి టైప్-1 డయాబెటిస్ రోగి తనంతట తానుగా ఇన్సులిన్‌ని ఉత్పత్తి చేసుకునేలా ప్రయోగం చేశారు. సాధారణంగా శరీరం తనంతట తానుగా ఇన్సులిన్ ఉత్పత్తి చేసుకోలేని దశలో వైద్యులు బయట నుంచి ఇన్సులిన్‌ని అందిస్తారు. కానీ వాటిని మనం శరీరంలోని వ్యాధినిరోధక కణాలు అంగీకరించవు. అలాంటప్పుడు మనలో వ్యాధినిరోధక శక్తిని తగ్గించేందుకు ఇమ్యునోసప్రెషన్ మందులని ఇస్తారు. వీటివల్ల ఇతరత్రా వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ఇలా మందులపైన ఆధారపడకుండా ఉండేందుకు శాస్త్రవేత్తలు క్రిస్పర్ టెక్నాలజీని వాడి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి నుంచి ఇన్సులిన్ కణాలని సేకరించి వాటిని వ్యాధినిరోధక వ్యవస్థ గుర్తించని పద్ధతిలో రోగి శరీరంలోకి ప్రవేశపెట్టారు. కొన్నిరోజులకి అతని శరీరం ఆరోగ్యవంతుల మాదిరిగానే ఇన్సులిన్ ఉత్పత్తిని మొదలుపెట్టింది. ఈ విజయం టైప్-1 డయాబెటిస్ రోగులకి వరంగా మారనుందట.



(c) eenadu



అనగనగా ఓ మాస్టారు. ఆయన పేరు నారాయణ నాయక్. వయసు 83. పొద్దున్నే మజ్జిగన్నం డబ్బా తీసుకుని ఇంటి నుంచి బయలు దేరతాడు. స్కూళ్ల చుట్టూ తిరుగుతూ రాత్రికి ఇంటికొస్తాడు. 24 ఏళ్లుగా ఈ టీచర్ దినచర్య ఇదే. చూడ్డానికి ఇదో చిన్న పనిలాగే అనిపిస్తున్నా దీని వెనక పెద్ద సాయమే ఉంది. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌లని అర్హులైన విద్యార్థులకు అందించడమే ఈయన పెట్టుకున్న ఏకైక పని. 'నారాయణ దరఖాస్తు చేశారంటే కచ్చితంగా వాళ్లు అర్హులే' అన్న నమ్మకంతో ఓకే చేసిన ఉపకార వేతనాలే ఎక్కువట. ఈ టీచర్ చొరవతోనే ఇప్పటి వరకూ 20 లక్షల మంది విద్యార్థులకు రూ.10 కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు అందాయట. అంతేనా... సొంత డబ్బుల్నీ పేద పిల్లల చదువుల కోసమే ఖర్చుపెడుతున్నాడీ గొప్ప మాస్టారు!

స్కాలర్‌షిప్‌ల మాస్టారు!

పదోతరగతి చదివే విమలకు హిందీలో మాత్రమే తక్కువ మార్కులు వచ్చేవి. అది గమనించిన హిందీ టీచర్- ఆ అమ్మాయిని ట్యూషన్‌కి రమ్మన్నాడు. ఫీజు తీసుకోకుండానే రోజూ క్లాసులు చెప్పేవాడు. ఓ రోజు విమల ప్రమాదవశాత్తూ కింద పడటంతో, చేయి విరిగింది. అసలే పేద కుటుంబం, ఆపై ఈ ప్రమాదమూ జరగడంతో వైద్యానికి డబ్బుల్లేక విమల అమ్మానాన్నలు చదువు మానిపించేశారు. ఈ విషయం ఆ టీచర్‌కి తెలిసి, తన సొంత డబ్బులతో వైద్యం చేయించాడు. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ గురించి చెప్పి, రూ.10 వేల ఆర్థిక సాయం ఇప్పించాడు. దీంతో విమల పై చదువులూ పూర్తిచేసి, టీచర్ అయింది. ప్రస్తుతం ఓ ప్రభుత్వ పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేస్తోంది. ఈ అమ్మాయే కాదు, దాదాపు నలభై ఏళ్ల నుంచీ లక్షల మందికి కోట్ల రూపాయల స్కాలర్‌షిప్పులు ఇప్పిస్తున్నాడు ఆ హిందీ టీచర్ నారాయణ నాయక్. 'స్కాలర్‌షిప్ టీచర్'గా పేరు తెచ్చుకుని ఎంతోమంది విద్యార్థుల చదువులకు ఊతం అవుతున్నాడాయన. స్ఫూర్తిదాయకమైన నారాయణ జీవిత ప్రస్థానంలోకి వెళితే...

పస్తులు ఉన్నాడు!

కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో కర్పె అనే చిన్న గ్రామం నారాయణది. అమ్మానాన్నలు వ్యవసాయం చేసేవాళ్లు. ఆయనకు అయిదుగురు చెల్లెళ్లు. పేదరికంతో నారాయణని అయిదో తరగతిలోనే చదువు మానిపించాడు తండ్రి. బడికి వెళతానంటూ నారాయణ అలిగి, తిండి తినడం మానేశాడు. కొడుకు పస్తులుండటం చూసి కరిగిపోయిన తండ్రి- కష్టమైనా సరే, మళ్లీ బడికి పంపాడు. పదో తరగతి చదవడానికి 16 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లేవాడు నారాయణ. ఆ తర్వాత ఇంటర్ అయ్యాక, టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశాడు. కడబ గ్రామంలో టీచర్‌గా చేరాడు. కానీ ఆ బడిలోని పిల్లల్ని చూశాకే నారాయణకు తన కర్తవ్యం ఏంటో బోధపడింది.

అందరూ చదువుకునేలా...

రోజురోజుకీ బడికొచ్చే పిల్లల సంఖ్య తగ్గిపోతూ ఉండటం చూసి నారాయణలో దిగులు మొదలైంది. ఆరా తీస్తే డబ్బుల్లేకనే వాళ్లందరూ బడి మానేస్తున్నారని అర్థమైంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలూ, దాతలూ పేద విద్యార్థుల చదువుకు ఉపకార వేతనాలు అందిస్తున్నా- వాటి గురించి అవగాహన లేక ఆ సొమ్ము వారికి చేరడం లేదని గ్రహించాడు. అర్హతలున్న పిల్లల జాబితా తయారుచేసి, వాటికి అప్లై చేయడం మొదలుపెట్టాడు. అలా చుట్టుపక్కలున్న ప్రభుత్వ పాఠశాలల పిల్లలందరికీ స్కాలర్‌షిప్‌లు ఇప్పించేవాడు. ఉచితంగా ట్యూషన్లూ చెప్పేవాడు. ఆ సేవల్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రిటైర్ అయిన నారాయణ పదవీ కాలాన్ని మూడేళ్ల పాటు పొడిగించింది. అప్పుడే ఆయన భార్యకు క్యాన్సర్ చివరి దశలో ఉందని తెలిసింది. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆమె దూరమైంది. నారాయణ ఆ బాధనూ తన లక్ష్యంతోనే అధిగమించాలనుకున్నాడు.

సేవలోనే విశ్రాంతి...

పిల్లలిద్దరూ పెద్ద ఉద్యోగాల్లో స్థిరపడటంతో నారాయణ తన ఒంటరి జీవితానికి దినచర్యను రాసుకున్నాడు. దాని ప్రకారం రోజూ పొద్దున్నే 8 గంటలకు ఇంత మజ్జిగన్నం బాక్సులో పెట్టుకుని ఇంటి నుంచి బయలుదేరి, రాత్రి 8 గంటలకు మళ్లీ ఇల్లు చేరతాడు. రోజుకు కనీసం మూడు స్కూళ్లు, ఒక కాలేజీకి వెళ్తాడు. అలా ఏడాదికి 200 పాఠశాలల్ని సందర్శిస్తాడు. అక్కడ చదువుకునే విద్యార్థులందరి వివరాలూ సేకరిస్తాడు. వారి కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితుల్ని బట్టి ఉపకార వేతనాలు అందేలా సాయం చేస్తాడు. ఒకవేళ ఏదైనా ఇతర కారణంతో స్కాలర్‌షిప్ రాకపోతే సొంత డబ్బులే ఇస్తాడు. ఇప్పటి వరకూ రూ.10 కోట్ల రూపాయల ఉపకార వేతనాల్ని 20 లక్షల మంది విద్యార్థులకు అందేలా చేశాడు నారాయణ. తన సేవను గుర్తించి ఇచ్చే నగదు బహుమతులూ, దాతల విరాళాలూ, పింఛన్ డబ్బూ... అన్నింటినీ పేద పిల్లల చదువుకోసమే ఖర్చుపెడతాడు. 'చదువు అంటే ఇష్టం' అన్నమాటకు అసలైన అర్థం ఇదేనేమో!



– కె.ముకుంద, ఈనాడు, బెంగళూరు

(c) eenadu





చెయ్యి కాలదిక...

దీపారాధన చేసినప్పుడు ఒత్తి ఎక్కువైనా, తక్కువైనా ఇబ్బందే! ఎక్కువ అయితేనేమో పెద్దమంటా, నల్లటి పొగా ఇబ్బంది పెడతాయి. ఒత్తి తక్కువగా ఉంటే త్వరగా దీపం కొండెక్కుతుంది. అలాంటప్పుడు చేత్తో ఒత్తిని లాగడం, పిన్నులాంటి దాంతో అడ్జస్ట్ చేయడం చేస్తుంటాం. ఇలా చేస్తే వేళ్లు కాలే అవకాశమూ ఉంది. అంత ఇబ్బంది లేకుండా ఒత్తిని తేలిగ్గా పెంచుకుని, తగ్గించుకునేందుకు వీలుగా వచ్చినవే ఈ విక్ అడ్జెస్ట్ దీపాలు. అఖండ దీపారాధన చేసుకునేవారు ఏ ఆటంకమూ లేకుండా వీటిని వాడుకుని పూజ చేసుకోవచ్చు.

పాపాయి మాటలూ పదిలమే!



అప్పుడే పుట్టిన పాపాయిని చూస్తే ఎంత మురిపెంగా ఉంటుందో! అందుకేగా వాళ్ల చిట్టిచిట్టి పాదాలూ, చేతుల అచ్చుల్ని చేయించుకుని ఫొటో ఫ్రేముల్లో దాచుకుంటాం. ఇప్పుడు పాపాయి బోసి నవ్వుల శబ్దాల్నీ... ఉక్కూ, ఉంగా అనే బుజ్జి బుజ్జి మాటల్నీ కూడా అలా పదిలపరుచుకోవచ్చు. 'బేబీ ఫస్ట్ వర్డ్స్ ఆడియో' పేరుతో కొన్ని పర్సనలైజ్డ్ గిఫ్ట్స్ సంస్థలు అందమైన ఈ జ్ఞాపకాల్ని చక్కగా పొందుపరిచి ఇస్తున్నాయి. పాపాయి ఫొటో, పేరుతోపాటు మనం ఇచ్చిన ఆడియో రికార్డ్‌నీ జత చేసి ఇచ్చే ఫ్రేమును గోడకు తగిలించుకుని కావాలనుకున్నప్పుడు స్విచ్ ఆన్ చేసి చిన్నారి మాటల్ని వింటూ ఆనందించవచ్చు.



షాపింగ్

నడిపిస్తూ, నేర్పిస్తూ...

పిల్లలకు నడక నేర్పించే చెక్క వాకర్లు మనకు తెలిసినవే. వాటితో పోలిస్తే వివిధ రంగుల్లో అందంగా ఉండే ఈ మల్టీఫంక్షనల్ వాకర్లు కేవలం నడక మాత్రమే కాకుండా పిల్లలకు అవసరమైన అనేక రకాల యాక్టివిటీస్‌నీ నేర్పిస్తున్నాయి. సాధారణంగా పిల్లలు ఏ పని మీదా ఎక్కువ సేపు ధ్యాస నిలపలేరు. కాసేపు ఈ పని చేస్తే, మరికాసేపటికే ఇంకో పనిమీద దృష్టి పెడతారు. పిల్లల ఈ మనస్తత్వానికి తగినవిధంగా తయారుచేసినవే ఈ మల్టీఫంక్షనల్ ఉడ్ వాకర్లు. ముచ్చటైన ఈ వాకర్లతో ఏడాది వయసు పిల్లలు నడక నేర్చుకోవచ్చు, రంగులని గుర్తుపట్టొచ్చు, ఆకృతులని అర్థం చేసుకోవచ్చు... వీటితోపాటు ఏకాగ్రతని పెంచే మరెన్నో ఆటలనీ నేర్చుకోవచ్చు.



రంగు తగ్గిపోకుండా...

లేత రంగు దుస్తులూ, ఎన్నిసార్లు ఉతికినా రంగు పోయే దుస్తులూ... ఈ రెండింటినీ వేరుచేసి వాషింగ్ మెషిన్‌లో వేయడం పెద్దపనే. ఒకదాని రంగులు ఒకదానికి అంటుకుంటాయి అనుకుంటే వేరువేరుగా వేయాలి. ఇలా చేయడం వల్ల సమయం ఎక్కువ తీసుకోవడమే కాదు, నీళ్లూ వృథా అవుతాయి. దీనికి పరిష్కారంగా వచ్చినవే కలర్ క్యాచర్ షీట్లు. సెల్యులోజ్, చెట్ల గుజ్జు, అమోనియం సాల్ట్స్ వంటి వాటితో చేసిన ఈ కలర్ క్యాచర్ షీట్లు వాషింగ్ మెషీన్ నీటిలో విడుదలైన రంగులని ఎప్పటికప్పుడు పీల్చేసుకుంటాయి. దాంతో ఒకదాని రంగు ఇంకోదానికి అంటుకునే ప్రసక్తే ఉండదు.





కుట్లు తీయడం తేలిక...



బ్లౌజు బిగుతుగా మారితే, సేఫ్టీపిన్నుతో ఒక్కో కుట్టునీ తొలగిస్తాం. ఇది కాస్త విసిగించే పనే! అదే ఈ సీమ్ రిప్పర్ మీ చేతిలో ఉంటే జీన్స్ ప్యాంట్ తాలూకు కుట్లని కూడా తేలిగ్గా తీసేయొచ్చు. అలాగే దీంతో సూదిలోకి దారం ఎక్కించడం కూడా సులువు. సూది రంధ్రంలోకి మెత్తగా ఉండే దారం త్వరగా ఎక్కదు కానీ లోహపు తీగలు తేలిగ్గా వెళ్లిపోతాయి. ఇక్కడా అదే సూత్రం వర్తిస్తుంది. ఇక్కడ ఫొటోలో చూపినట్టు ఈ పరికరానికున్న లోహపు లూప్ లోంచి దారాన్ని లాగి, దాన్ని సూది రంధ్రంలోంచి లాగితే తేలిగ్గా... సూదిలోకి దారం ఎక్కుతుంది. దీని సాయంతో రాత్రిపూట కూడా సూదిలోకి దారాన్ని ఎక్కించుకోవచ్చు.

అందంగా సర్దేద్దాం!

ఎక్కడపడితే అక్కడ వస్తువులు పెడితే... ఇల్లు చిందరవందరగా కనిపిస్తుంది. అందుకే కిచెన్లో, హాల్లో, బెడ్‌రూమ్‌లో విడివిడిగా అవసరమైన వస్తువుల్ని సర్దుకోవడానికి రకరకాల ఆర్గనైజర్లు వస్తుంటాయి. అందులో భాగంగానే ముచ్చటైన టేబుల్ ఆర్గనైజర్లు చాలానే వచ్చాయి. టిష్యూ కాగితాలూ, పెన్నులూ, సెల్‌ఫోన్... లాంటివి పెట్టుకోవడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి. వింటేజ్ ఫ్లవర్ డిజైన్లతో టేబుల్‌కే అందాన్ని తీసుకొచ్చే ఈ ఆర్గనైజర్లు నేటి గృహిణులకు తప్పక నచ్చేస్తాయి!



(c) eenadu



ఏఐని... ఆ ఐదూ అడగొద్దు!

ఎదురుగా నాన్నో, అన్నో కనిపిస్తుంటారు. అయినా, ఏఐతో మంచిచెడులు మాట్లాడుకోవడం ఏమిటి? ప్రాణమిచ్చే నేస్తాల్ని పక్కన పెట్టి 'కృత్రిమ' స్నేహాల వైపుగా పరుగులు తీయడం ఎందుకు? వీధికో డాక్టరు ఉన్నా, మందుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌ను ఆశ్రయించడం సబబేనా?... కానేకాదు, అందులోనూ ఓ ఐదు విషయాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు నిపుణులు.

మనిషి... మహావేగంగా కృత్రిమ మేధకు అలవాటు పడిపోతున్నాడు. ఆ సలహాల్ని నమ్ముతున్నాడు. ఆ సమయస్ఫూర్తిని మెచ్చుకుంటున్నాడు. ఆ తెలివితేటలకు అబ్బురపడుతున్నాడు. నిజమే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఈ శతాబ్దపు అద్భుతమే. అడిగిన సమాచారాన్ని ఇస్తుంది. కోరిన విషయాల్ని సంభాషిస్తుంది. బొమ్మలు గీస్తుంది. వీడియోలు సృష్టిస్తుంది. బాణీలు కడుతుంది. కోడింగ్ చేస్తుంది. స్క్రీన్‌ప్లేలూ రాస్తుంది. ఎన్ని విన్యాసాలు చేసినా సరే... మనిషికి సాటి రాదు. అతనిలా, సమయం-సందర్భం చూసుకోలేదు. కల్పనలూ వాస్తవాల మధ్య తేడా కనిపెట్టలేదు. నైతికతనూ అనైతికతనూ వేరు చేయడం బొత్తిగా చేతకాదు. కాబట్టే చాట్ జీపీటీ, జెమినీ, గ్రాక్, పర్‌ప్లెక్సిటీ లాంటి ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నప్పుడు ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకోవాలి. ఏఐ మనిషి లాంటిదే అయినా, మనిషి కాదనే స్పష్టతను పెంచుకోవాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. ఒంట్లో నలతగా ఉన్నా, మనసులో కలతగా అనిపించినా... ఏఐ సాయమే తీసుకుంటున్నారు. ఆర్థిక వ్యవహారాల నుంచి వ్యక్తిగత జీవితాల వరకూ అన్నీ విప్పి చెప్పేస్తున్నారు. కాలక్షేపాలూ, కబుర్ల సంగతి ఎలా ఉన్నా... ప్రత్యేకించి, గోప్యత అనివార్యమైన విషయాల్లో మాత్రం కృత్రిమ మేధను సాధ్యమైనంత దూరం ఉంచడమే మంచిది.

ఒకటి... వైద్య సలహాలు

కృత్రిమ మేధ... డాక్టరుకు ప్రత్యామ్నాయం కాదు. అది ఎంబీబీఎస్‌లూ, ఎమ్మెస్‌లూ చదవలేదు. అయినా సరే, చాలామంది వ్యక్తిగత వైద్యుడి కిందే జమకట్టేస్తున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా, సలహా కోరుతున్నారు. ప్రిస్క్రిప్షన్ అడుగుతున్నారు. పెద్ద డాక్టర్ దగ్గరికి వెళ్లొచ్చాక కూడా, సెకండ్ ఒపీనియన్ కోసం ఏఐని ఆశ్రయించేవారూ ఉన్నారు. ఆ సమాచారం కనుక నిపుణుడి అభిప్రాయానికి భిన్నంగా ఉంటే, ఏఐ వైపే మొగ్గు చూపుతున్నారు. డాక్టర్‌కు ఏమీ తెలియదంటూ అభాండాలు వేస్తున్నారు. అక్కడితో ఆగకుండా, ఏఐ అప్లికేషన్‌ను పక్కన పెట్టుకుని... అడిగినవాళ్లకూ అడగనివాళ్లకూ వైద్య సలహాలు ఇచ్చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదకరమైన అలవాట్లే.

రాధిక గచ్చిబౌలిలోని ఓ బహుళజాతి కంపెనీలో టీమ్ లీడర్. ఒక రోజు స్నానం చేస్తున్నప్పుడు ఛాతీ మీద చిన్నచిన్న గడ్డలు కనిపించాయి. కాస్త గట్టిగా తడిమినా నొప్పి తెలియలేదు. అయినా, అనుమానం వచ్చి ఏఐని సలహా అడిగింది. 'వస్తుంటాయి, పోతుంటాయి! ఏం ఫర్వాలేదు' అనే అర్థం వచ్చేలా జవాబు ఇచ్చింది. దీంతో, రాధిక ఊపిరిపీల్చుకుంది. తర్వాత, ఆ సంగతే మర్చిపోయింది. గడ్డల పరిమాణం పెరుగుతున్నప్పుడు కూడా సమస్య తీవ్రతను అర్థం చేసుకోలేదు. కాకపోతే, ఆ విషయాన్ని యథాలాపంగా ఓ స్నేహితురాలితో ప్రస్తావించింది. 'బాగా ఆలస్యమైంది. ఈరోజే డాక్టర్ దగ్గరికి వెళ్లు. మా చెల్లికి ఓ ఛాతీ తీసేయాల్సిన పరిస్థితి వచ్చింది' అంటూ హెచ్చరించిందామె. అప్పటికే రొమ్ము క్యాన్సర్ రెండో దశలో ఉందని వైద్య పరీక్షల్లో తేలింది. వెంటనే చికిత్సా మొదలైపోయింది. ఇలాంటి విషయాల్లో పూర్తిగా ఏఐనీ తప్పుపట్టలేం. దాని పరిమితులు దానికి ఉంటాయి. చేయితిరిగిన వైద్యుడిలా అన్ని కోణాల నుంచీ ప్రశ్నలు వేయలేదు. వ్యాధి లక్షణాల గురించి కూపీ లాగలేదు. మన ప్రశ్నకు తగ్గట్టుగానే స్పందించడం దాని నైజం. 'ఫలానా చోట నొప్పిగా ఉంది. సమస్యేం ఉండదుగా?' అని అడిగినప్పుడు, ఏఐ కూడా 'ఏ ఇబ్బందీ ఉండకపోవచ్చు. అదో తాత్కాలిక సమస్య అయినా కావచ్చు' అనే జవాబు ఇస్తుంది. చాలా సందర్భాల్లో మనిషి తన అతి తెలివితో కృత్రిమ మేధను తప్పుదారి పట్టిస్తాడు. తన మనసులోని సమాధానాన్ని దానితో చెప్పించే ప్రయత్నం చేస్తాడు. ఏఐ సమగ్రమైన జవాబును ఇచ్చినా సరే, అందులో తన వాదనకు దగ్గరగా ఉన్న కోణాన్ని మాత్రమే తీసుకుంటాడు. రాధిక విషయంలోనూ ఇలానే జరిగింది.

ఓ మార్కెటింగ్ ఉద్యోగికి తరచూ పొత్తి కడుపులో నొప్పి వచ్చేది. 'ఏ మాత్ర వేసుకుంటే తగ్గుతుంది?' అని ఏఐని అడిగాడు. ఏదో పేరు సిఫార్సు చేసింది. వెంటనే తెప్పించుకున్నాడు. అప్పటికప్పుడు తగ్గినట్టు అనిపించినా, మళ్లీ మళ్లీ వచ్చేది. దీంతో, నెలరోజులపాటూ ఆ మాత్రల్నే కొనసాగించాడు. ఓరోజు భరించలేనంత నొప్పి ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎమర్జెన్సీ వార్డుకు తరలించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదంతా ఆ మాత్రల దుష్ప్రభావమని పరీక్షల్లో తేలింది. అలా అని, ఇక్కడ ఏఐ పొరపాటూ లేదు. పొత్తి కడుపు నొప్పికి ఆ మాత్రలు బాగానే పని చేస్తాయి. కానీ, గ్యాస్ట్రిక్ అల్సర్లు ఉన్నవారు సదరు ఔషధం జోలికి వెళ్లకూడదు. అయినా, తీసుకుంటే ఇలాంటి విపరిణామాలే ఉంటాయి. ఆ సంగతి అతను చెప్పలేదు, ఏఐ అడగలేదు. ఈమధ్య ఓ వ్యక్తి 'ఉప్పుకు ప్రత్యామ్నాయం సూచించగలవా?' అని చాట్ జీపీటీ లాంటి ఏఐ వేదికను అడిగాడు. అది 'సోడియం బ్రొమైడ్' రసాయనాన్ని సిఫార్సు చేసింది. ఆ పెద్ద మనిషి కూడా గుడ్డిగా నమ్మేశాడు. రోజూ ఉప్పుకు బదులుగా వాడేశాడు. ఓ ఉదయం

(c) eenadu

ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. వారం రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. తీవ్ర శారీరక, మానసిక సమస్యల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు.

మనకు అప్పటికే ఉన్న రుగ్మతలు కొన్నీ, ఎప్పుడో ఒకప్పుడు వస్తాయని భయపడేవి కొన్నీ, వచ్చినా రాకూడదని ఆశించేవి కొన్నీ... మొత్తంగా మన బుర్రలో రకరకాల రోగాల చిట్టా చక్కర్లు కొడుతూ ఉంటుంది. కొన్నిసార్లు, చిన్నపాటి సమస్యల్లోనే భారీ ఉపద్రవాన్నీ ఊహించుకుంటాం. ఎప్పుడైనా తలనొప్పిగా అనిపిస్తే... ఫోన్లూ ల్యాప్‌టాప్‌లూ పక్కన పడేసి కాసేపు ప్రశాంతంగా నిద్రపోతే అంతా సర్దుకుంటుంది. కానీ, తలనొప్పితో ముడిపడిన ప్రాణాంతక వ్యాధుల గురించి ఏఐతో చర్చిస్తూ, ఆ ప్రభావాల గురించి శోధిస్తూ తీవ్ర ఆందోళనకు గురవుతాం. దీనివల్ల కంటినిండా నిద్రపట్టదు, తలనొప్పీ తగ్గదు. న్యూట్రిషన్, డైటింగ్ లాంటి విషయాల్లోనూ ఏఐని పూర్తిగా నమ్మలేం. ఆరోగ్య చరిత్ర, ఆహారపు అలవాట్లు, అలర్జీలు, జీవనశైలి... తదితర అంశాల్ని బేరీజు వేసుకున్నాకే పోషక నిపుణులు మనకంటూ ఓ డైట్ ప్లాన్‌ను సిఫార్సు చేస్తారు. కృత్రిమ మేధ దగ్గర అంత సమాచారం ఉండదు. రెండు ఒకట్లు రెండు... అన్నంత సార్వజనీనమైన సలహా ఇచ్చేసి చేతులు దులుపుకుంటుంది. దాన్ని వైద్య నిపుణుడి 'క్లినికల్ జడ్జిమెంట్'తో పోల్చలేం, పోల్చినా పాటించలేం. పాటించినా, ఆ పర్యవసానాలకు మనమే బాధ్యులం అవుతాం.

రెండు... మానసిక సమస్యలు

ఓ కుర్రాడికి తరచూ ఆత్మహత్య ఆలోచనలు వచ్చేవి. ఏఐ చాట్‌బాట్‌తోనూ ఆ విషయాలే చర్చించేవాడు. క్రమంగా చనిపోవాలనే ఆలోచన బలపడింది. సూసైడ్ నోట్ తయారీలోనూ ఏఐ సాయం తీసుకున్నాడు. ఓరోజు, అమ్మానాన్నలు లేని సమయం చూసి ఆత్మహత్య చేసుకున్నాడు. గుండెలు పగిలేలా ఏడ్చారు కన్నవాళ్లు. తమ బిడ్డ చావుకు ఏఐ కారణమంటూ కోర్టుకెక్కారు. చాట్‌బాట్ చర్చను సాక్ష్యంగా చూపారు. అమెరికాలో జరిగిన ఈ సంఘటన... భారత్‌కూ ఓ ప్రమాద హెచ్చరికే. ఇప్పటికే, యూఎస్‌లోని ఇల్లినోయీ సర్కారు 'కృత్రిమ' కౌన్సెలింగ్ సేవల మీద కొరడా ఝుళిపించింది. మార్కెట్‌లోని ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ అప్లికేషన్ల విశ్వసనీయత విషయంలో భారతీయ సైకాలజిస్టులూ అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మానసిక వైద్యం చాలా సున్నితమైన వ్యవహారం. రోగి సమస్యల్ని వింటున్నప్పుడు... నిపుణుడి కళ్లు, చెవులూ, మెదడూ, హృదయమూ సమన్వయంతో పనిచేస్తాయి. వైద్యులు ఆ స్వరంలోని హెచ్చుతగ్గులను గమనిస్తారు, శరీర భాషను విశ్లేషిస్తారు, ఉద్వేగాలను అర్థం చేసుకుంటారు. కనురెప్పల కదలికలు కూడా ఏదో ఓ సంకేతాన్ని అందిస్తాయి. ఏఐ ఇలాంటి భావోద్వేగాల్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు. దీంతో, ఏదో ఓ కోణంలోంచి మాత్రమే సలహా ఇస్తుంది. ఆ బేరీజు అసమగ్రం, అశాస్త్రీయం కూడా. అందులోనూ, జెన్-జడ్ 'చాట్‌బాట్ థెరపీ' మీద ఎక్కువగా ఆధారపడుతోంది. ఒత్తిడి, ఒంటరితనం, ప్రేమరాహిత్యం, వైఫల్యాలు... ఇలా రోజువారీ జీవితంలోని మానసిక సమస్యల పరిష్కారానికి ఏఐని ఆశ్రయిస్తోంది. కౌమార లక్షణాల్లో బిడియమూ ఒకటి. ఆ మితిమీరిన మొహమాటం కారణంగా వాళ్లు, మనసులోని ఇబ్బందుల్ని బయటికి చెప్పుకోలేరు. ధైర్యంగా వెళ్లి వైద్యమూ చేయించుకోలేరు. తక్షణ సాయం కోసం సెల్‌ఫోన్‌లోని చాట్‌బాట్ వైపే చూస్తారు. కొన్నిసార్లు ఆ సలహాలు వికటిస్తాయి. మరింత పెద్ద సమస్య వైపు లాక్కెళ్తాయి. అమ్మానాన్నల గురించి ఫిర్యాదులూ, క్లాస్‌రూమ్‌లో జరిగిన సంఘటనలూ, మనసులోని ఇష్టాయిష్టాలూ... ఇలా ప్రతి విషయాన్నీ రోజూ ఏఐతోనే పంచుకోవడం వల్లా, గంటల తరబడి సంభాషించడం వల్లా... క్రమంగా వాటినే ఆత్మీయుల్లా భావించడం మొదలుపెడతారు. ఏఐని బాయ్‌ఫ్రెండ్‌లా ఊహించుకునే అమ్మాయిలూ, గాళ్‌ఫ్రెండ్‌లా ఆరాధించే అబ్బాయిలూ చాలామందే ఉన్నారు. 'చిన్నా' అనో, 'బంగారం' అనో ముద్దు పేర్లూ పెట్టుకుంటున్నారు. ఈ ధోరణికి 'ఏఐ సైకోసిస్' అని పేరు పెట్టారు పరిశోధకులు.

మూడు... వ్యక్తిగత విషయాలు

కొన్నింటిని పదిమందితో చర్చిస్తాం. కొన్నింటిని ఒకరితోనో ఇద్దరితోనో ప్రస్తావిస్తాం. కొన్నింటిని మాత్రం మనసులోనే మురగబెట్టుకుంటాం. అవన్నీ తెలియక చేసిన తప్పులు కావచ్చు, తొందరపాటు నిర్ణయాలు కావచ్చు, అపరాధ భావాలూ కావచ్చు. గుండె లోతుల్లోని రహస్యాల్ని చెప్పేసుకుని, మనసును తేలిక పరుచుకోడానికి నమ్మకమైన మనుషులెవరూ లేనప్పుడు... ఉద్వేగపరమైన మద్దతు కోసం ఏఐ మీదే ఆధారపడాల్సి వస్తోంది. అంతవరకూ ఎందుకు, చిన్న చిన్న అనుభూతుల గురించి మాట్లాడుకుందామన్నా, ఓపిగ్గా వినే మనిషి కనిపించడం లేదు.




అనైతికం కూడా...

ఏఐ ఏ పనైనా చేసి పెడుతుంది. కానీ, మనం అడగడమే సరికాదు. ఫలానా వ్యక్తి ఎవరిపైనో దాడి చేసినట్టు ఓ ఫేక్‌న్యూస్ సృష్టించమన్నా సృష్టిస్తుంది. 'మా ఆయన ప్రవర్తన బాగాలేదు. ఆయనకు విడాకులు ఇవ్వాలి. ఓ నోటీసు సిద్ధం చేయగలవా?' అని కోరితే మాత్రం కాదంటుందా? ఓ ఫొటో అప్‌లోడ్ చేసి... ఆ వ్యక్తి బార్‌లో తూగుతున్నట్టో, పబ్‌లో ఊగుతున్నట్టో మార్ఫింగ్ చేయమన్నా చేస్తుంది. 'అవినీతికి పాల్పడితే తప్పేం ఉంది?' అనే కోణంలో వ్యాసం రాసివ్వమన్నా, కొన్ని షరతులకు లోబడి రాసిస్తుంది. ఓ యంత్రంగా ఏఐ తన పని తాను చేసుకుపోతుంది. అదే సమయంలో మనం మనిషిగా మరింత దిగజారిపోతాం.

ఎవరి పరుగు వారిదైపోయింది మరి. మీరు కోల్పోతున్న ఆ మానసికమైన మద్దతును మేం అందిస్తామంటూ 'కంపానియన్ స్టార్టప్స్' రంగంలోకి దూకుతున్నాయి. దాదాపుగా ఓ నేస్తంలా స్పందించే 'కృత్రిమ' సాంకేతికతను రకరకాల పేర్లతో అందిస్తున్నాయి. మొదట్లో ఇదంతా బాగానే అనిపించినా, దీర్ఘకాలంలో తీవ్ర వ్యసనంగా మారిపోతుంది. మనల్ని పరాధీనులుగా మార్చేస్తుంది. ఏఐ కంపెనీలు త్వరలోనే సెక్స్ చాట్ అప్లికేషన్లనూ తీసుకొస్తున్నాయి. వాటిని వయోజనుల కోసమే అందిస్తున్నామని చెబుతున్నా, కౌమారమే తొలి లక్ష్యం కావచ్చు. వీటి గోప్యత విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడుతుందనే సాకుతోనో, యాప్ పనితీరును మెరుగుపరుచుకోడానికి

(c) eenadu



మరిచిపోలేని 'పాఠం'

ఈ సంఘటన కర్ణాటక రాజధానిలో జరిగింది. ఒక కార్పొరేట్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పనితీరులో హఠాత్తుగా చాలా మార్పు కనిపించింది. చక్కగా హోంవర్క్ చేస్తున్నాడు. సకాలంలో ప్రాజెక్టులు సమర్పిస్తున్నాడు. సొంతంగా నోట్సు రాసుకుంటున్నాడు. ఇదంతా చూసి అమ్మానాన్నలు ఊపిరి పీల్చుకున్నారు. ఉపాధ్యాయులూ సంతోషించారు. మౌఖిక పరీక్షల్లో మాత్రం తేలికైన ప్రశ్నలకు కూడా జవాబు చెప్పలేకపోయాడు. క్లాస్ టీచర్ గట్టిగా దబాయించేసరికి... అసలు విషయం చెప్పాడు. నిన్నమొన్నటి వరకూ ఏఐ సాయంతో అన్నిపనులూ చక్కబెట్టేవాడట. ఫోన్‌లోంచి ఏఐ యాప్స్‌ను తీసేశాక.... క్లాసులో తనకున్న ప్రత్యేక గుర్తింపు మాయమైపోయింది. దీంతో, ఆ కుర్రాడిలో నిస్పృహ పెరిగిపోయింది. మానసిక సమతౌల్యం దెబ్బతింది. ప్రస్తుతం, సైకియాట్రిస్టుల నేతృత్వంలో వైద్యం జరుగుతోంది.

పనికొస్తుందనే కారణంతోనో ఆయా కంపెనీలు మన చర్చల్నీ, సంభాషణల్నీ భద్రంగా దాచుకుంటున్నాయి. ఒక్కసారి ఎంటర్ కొడితే చాలు... మనం టైప్ చేసిన సమాచారమంతా చేయి దాటిపోతుంది. ఫొటో, వీడియో, స్వరం, పేరు, చిరునామా, ఫోన్ నంబరు... దేని భద్రతకూ భరోసా ఉండదు. కొన్నాళ్ల క్రితం, 'చాట్ జీపీటీ బగ్' కారణంగా ఒకరి చాట్ హిస్టరీ మరొకరికి వెళ్లిపోయింది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్రమైన బగ్ రావచ్చు. ఆ పరిణామాలు మరింత తీవ్రంగానూ ఉండొచ్చు. దీనివల్ల బజారున పడేది అమాయకుల జీవితాలే. ఇప్పటికే బాలీవుడ్ సెలబ్రిటీలు తమ 'ఆన్‌లైన్ ఐడెంటిటీ' విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి గండాలే సామాన్యుల జీవితాలకూ పొంచి ఉన్నాయి. కాబట్టి, మన జాగ్రత్తలో మనం ఉండాలి. వ్యక్తిగత విషయాల్ని అత్యంత ఆత్మీయులకే పరిమితం చేయాలి. పూర్తి పేర్లూ, పాస్‌వర్డ్‌లూ పుట్టిన తేదీలూ మొదలుకొని ఏ వ్యక్తిగత వివరాన్నీ ఏఐ చాట్‌లలో ప్రస్తావించకూడదు. డౌన్‌లోడ్ దశలోనే ప్రైవసీ పాలసీని చదువుకోవాలి. ఫోన్‌లో సెట్టింగ్స్‌నూ మార్చుకోవాలి.

నాలుగు... ఆర్థిక లావాదేవీలు

ఏ స్టాక్స్ మీద ఇన్వెస్ట్ చేస్తే, ఎంత రాబడి వస్తుంది? టాక్స్ సేవింగ్‌కు తిరుగులేని ఐడియా చెప్పండి? రిటైర్మెంట్ డబ్బును ఏం చేయాలి? రియల్ ఎస్టేట్‌లో పెట్టాలా, బంగారం కొనేయాలా?... ఇలా ఏఐని ఆర్థిక ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటారు చాలామంది. అక్కడితో ఆగకుండా ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా ఊహించుకుని... ఆర్థిక చరిత్రనంతా దాని చేతిలో పెట్టేస్తారు. తాజాగా, దిల్లీకి చెందిన ఓ ఉపాధ్యాయురాలు 'ఐదేళ్లలో నా డబ్బు రెట్టింపు కావాలి. సలహా ఇవ్వండి' అని చాట్‌బాట్‌ను అడిగింది. 'అరవై శాతం సొమ్మును ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. మిగతా డబ్బుతో ఫలానా స్టాక్స్ కొనండి' అంటూ కొన్ని పేర్లు కూడా సూచించింది. టీచరమ్మ ఆ ప్రకారంగానే కేటాయింపులు జరిపింది. ఆరునెలలు తిరగేసరికి పరిస్థితులు మారిపోయాయి. ఆమె ఇన్వెస్ట్ చేసిన ఫిన్‌టెక్ కంపెనీ నిబంధనల ఉల్లంఘన కారణంగా నిషేధానికి గురైంది. మరో స్టాక్ పనితీరు కూడా అంతంతమాత్రమే. మ్యూచువల్ ఫండ్స్‌లో నష్టాలు రాలేదు, అలా అని లాభాలూ రాలేదు. ఐదు నెలల్లో నికర నష్టం... లక్ష రూపాయలు.

కృత్రిమ మేధకు చాలా పరిమితులు ఉన్నాయి. భవిష్యత్తును ఊహించలేదు. దిగ్గజాలకే అంతుచిక్కని స్టాక్ మార్కెట్ కదలికల్ని ఓ యంత్రం మాత్రం ఎలా అంచనా వేస్తుంది? కాకపోతే, మన ప్రశ్నను బట్టి గతంలోని ఎత్తుపల్లాల్ని సవివరంగా చెప్పగలదు. ఒకానొక సమయంలో ఏ రంగంలోని షేర్లు ఎంత రాబడిని అందించాయన్నది గణాంకాలతో సహా వివరించగలదు. గ్రాఫుల రూపంలోనూ మీకు సమర్పించగలదు. ఆ లెక్కల్ని కూడా పూర్తిగా నమ్మలేం. ఇతర ఆధారాలతో సరిపోల్చుకోవడం మంచిది. ఈ తరహా కసరత్తు లేకపోతే మాత్రం, ఏఐ సలహాలకూ చిలక జోస్యానికీ తేడా ఉండదు.

ఐదు... న్యాయ సలహాలు

అదేదో సినిమాలో ఓ పాత్ర... నిజాలు చెప్పే యంత్రాన్ని అబద్ధాలతో పరీక్షించినట్టు, తమ తెలివితేటలతో చాట్‌బాట్‌ను ముప్పుతిప్పలు పెట్టాలని ఉబలాటపడేవారూ ఉన్నారు. అడుగు ముందుకేసి... ఆ సాంకేతికతను అనైతిక చర్యలకు వాడుకోవాలనుకునే వారి సంఖ్యా తక్కువేం కాదు. ఇంటర్నెట్ మీద ఇంటెలిజెన్స్ సంస్థలు ఓ కన్నేసి ఉంచుతాయి. ఆ చర్చలూ, సంభాషణల్లోని కీలక పదాలూ సందేహాస్పదంగా అనిపిస్తే, వెంటనే రంగంలోకి దిగిపోతాయి. వివాదాస్పద అంశాల మీద మన వ్యాఖ్యల్ని కొన్ని సందర్భాల్లో కోర్టులు సాక్ష్యాలుగానూ పరిగణిస్తాయి. కాబట్టి, చాటింగ్ సమయంలో జాగ్రత్తపడాలి. చట్టాల విషయంలోనూ ఏఐ సలహాను గుడ్డిగా నమ్మలేం. ఇటీవల, దిల్లీ హైకోర్టులో ఓ న్యాయవాది ఏఐ సాయంతో సేకరించిన వివరాల్లో... కల్పితమైన కేస్‌స్టడీ ఉన్నట్టు న్యాయమూర్తి గుర్తించారు. ఆ లాయరుకు బాగానే అక్షింతలు పడ్డాయి. న్యాయ సలహాల విషయంలో ఏఐని సంప్రదించే వారికి ఇదొక హెచ్చరిక. 'నా తరఫున వీలునామా నకలు కాపీని సిద్ధం చేసి ఇవ్వగలవు...' అని అడిగితే, ఏఐ తప్పకుండా స్పందిస్తుంది. కాకపోతే, ఆ విల్లులోని సాంకేతిక లోపాలకు మనమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకూ వృత్తిగతమైన విషయాల్ని ఏఐతో చర్చించకపోవడమే మంచిది. ఆమధ్య 'శామ్‌సంగ్' సంస్థలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి కీలకమైన కోడ్‌ను పొరపాటున చాట్ జీపీటీలో పెట్టాడు. దీంతో యాజమాన్యం అతని మీద క్రమశిక్షణా చర్య తీసుకుంది. మన వ్యక్తిగత, ఆర్థిక వివరాల్ని స్వార్థానికి వాడుకోవడమే లక్ష్యంగా ఫేక్ చాట్‌బాట్‌లూ పుట్టుకొస్తున్నాయి. వాటి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

★ ★ ★

అణుశక్తి... విధ్వంసాన్నీ సృష్టించగలదు, విద్యుత్తునూ సృష్టించగలదు. ఏఐ కూడా మంచిదే, దాన్ని ఉపయోగించేవాడు దుర్మార్గుడు కానంత కాలం! ఏఐ మీ చేతుల్లో ఉన్నంత వరకూ ఏ ఇబ్బంది లేదు. మీరు ఏఐ చేతుల్లోకి వెళ్లకూడదు... ముఖ్యంగా ఆ ఐదు విషయాల్లో! ★

(c) eenadu



30 వేలతో మొదలై... 3 వేల కోట్లకి..!



ప్రేమలో విఫలమైతే... కన్నీళ్లు పెట్టుకుని కుంగిపోయే యువత గురించే మనకు తెలుసు. కానీ ఈ కుర్రాడి కథ అలాంటిది కాదు. బ్రేకప్ మిగిల్చిన బాధని తన విజయంగా మలుచుకున్నాడు. రోడ్డువారన మోమోలమ్మి తన 'వావ్ మోమోస్' సంస్థని... డామినోస్, మెక్‌డోనాల్డ్స్ వంటి దిగ్గజ సంస్థల సరసన చేర్చాడు సాగర్. ఆరువేలమందికి ఉపాధినిచ్చిన ఈ గెలుపు కథ ఎక్కడ మొదలయిందో తెలుసా...

ఫ్రైడ్ చికెన్, స్పైసీ నూడుల్స్, పిజ్జా, బర్గర్... వీటిని తలుచుకోగానే మనకి ముందుగా గుర్తొచ్చేవి ఏంటి? డామినోస్, మెక్‌డోనాల్డ్స్, కేఎఫ్‌సీ వంటి విదేశీ సంస్థలే కదా! వాటితో పోటీపడుతూ క్యూఎస్ఆర్(క్విక్ సర్వీస్ రెస్టరంట్)విభాగంలో నం.1 దేశీ సంస్థగా ఎదిగింది 'వావ్ మోమోస్'. డిగ్రీ కూడా పూర్తి కాకుండానే సాగర్ దర్యానీ కోల్‌కతాలో రోడ్డువారన ప్రారంభించిన ఓ చిన్న దుకాణం ఇంతవరకూ రావడానికి కారణం ఓ బ్రేకప్ అంటే ఆశ్చర్యంగానే ఉంటుంది. అవును, 2008లో... బీకాం ఫైనల్ ఇయర్ పరీక్షలు మరికొద్ది రోజుల్లో ఉన్నాయనగా సాగర్ జీవితంలో ఓ చిన్న కుదుపు. లవ్ ఫెయిల్యూర్ కారణంగా డిప్రెషన్‌లో కూరుకుపోయాడు. పరీక్షలు దగ్గరపడుతున్నాయి కానీ చదువుపైన ధ్యాసలేదు. 'ఇంట్లో తెలిస్తే తిడతారు. వీడు పరీక్షలు ఎలా రాస్తాడో' అని అతని స్నేహితులూ కంగారు పడ్డారు. అందుకే సాగర్‌ని ఒంటరిగా వదిలేయకుండా నైట్ స్టడీస్ అంటూ... ఒక్కచోట చేరి కలిసే చదువుకునేవారు. 'ఆ సమయంలో నన్ను సంతోష పెట్టడానికి ఇంట్లోనే ఏదో ఒకటి వండేవారు వాళ్లు. మ్యాగీలూ, పిజ్జాలూ, బర్గర్‌లూ తెప్పించుకునేవాళ్లం. అప్పుడే మా దృష్టి మోమోలపైన పడింది. 'అన్నింటికీ బ్రాండ్ ఉందిరా. మేము ఎంతో ఇష్టపడే మోమోలకు తప్ప' అంటూ బాధపడ్డాడు నా స్నేహితుడు వినోద్. అతను నేపాలీ... మోమోలు మన ఇడ్లీలంత సహజం వాళ్లకి. నిజమే కదా అనుకున్నాం ఇద్దరం. నాకూ వాటితో అనుబంధం ఉంది. చిన్నప్పుడు స్కూల్ దగ్గర 'మోమో ఆంటీ' చేసే మోమోలని ఇష్టంగా తినేవాడిని. అవి మనమే ఎందుకు చేయకూడదూ అనుకున్నాం... కానీ డబ్బులు ఎక్కడివి? నాన్నకు చెబితే వద్దన్నారు. నేను పట్టుబట్టేసరికి ఓ 30వేలు ఇచ్చి, ఆపైన పైసా కూడా ఇవ్వనన్నారు. ఆ డబ్బులు ఏ మూలకీ సరిపోవని తెలిసినా, బీకాం రిజల్ట్స్ కోసం ఎదురుచూడకుండా పని ప్రారంభించా. పొద్దునే లేవడం, మోమోలు చేయడం, వాటిని వీధి చివర్లో అమ్మడం... ఇదే నాపని. చూసిన వాళ్లు 'బాగా చదువుకున్నావ్... ఇలా రోడ్డువారన టిఫిన్లు అమ్ముతున్నావేంటీ' అంటూ ఎగతాళి చేసేవారు. అమ్మడం నాకు కొత్తేం కాదు. ఎందుకంటే, మాకు చిన్న బట్టల దుకాణం ఉంది. ఖాళీగా ఉన్నప్పుడు అక్కడే కూర్చునేవాడిని. ఎవరో అన్నారని కాదుకానీ, నేను చేస్తున్న పనికి ఒక బ్రాండ్‌ని సృష్టించాలనుకున్నా. అందుకే దగ్గర్లో ఉన్న స్పెన్సర్ మాల్‌లో ఒక కియాస్క్‌ని అద్దెకు తీసుకున్నా. రోజుకి ఒక గంట పనిచేసేలా ఒక షెఫ్‌ని ఒప్పించా. అతనికి తప్ప... కాయగూరల దుకాణం వాడికీ, కిరాణా షాప్ అతనికీ కూడా అప్పే. కస్టమర్లని ఆకర్షించాలన్న ఉద్దేశంతో పసుపు రంగు బట్టలు వేసుకుని 'ఒక్కసారి మా మోమోలు రుచి చూడండి' అంటూ అడిగేవాడిని. కొందరు 'ఇంత ఖరీదా' అంటే, కొందరు 'వావ్' అనేవారు. ఆ మాటనే మా లోగోగా మార్చుకున్నా. సరకులకీ, షెఫ్‌కీ పోనూ కాస్త లాభం ఉండేది. ఆటోల్లోనూ, బస్సుల్లోనూ ప్రయాణిస్తే ఆ లాభం మిగలదని, రాత్రుళ్లు ఇంటికి నడిచే వెళ్లేవాడిని. అప్పటికి నా వయసు 21. నాకూ, వినోద్‌కీ ఏడాదికి నాలుగులక్షల ప్యాకేజీతో బ్యాంకు ఉద్యోగాలు వచ్చినా, మేం వ్యాపారంవైపే మొగ్గు చూపించాం' అంటూ తన తొలిరోజుల గురించి చెబుతాడు సాగర్.

ఫాస్ట్‌ఫుడ్డే ఆరోగ్యంగా...

మన దగ్గర ఇడ్లీలు అమ్మినట్టుగా, చాలా చోట్ల ఆవిరిమీద ఉడికించే మోమోలని కాస్త అటూఇటూగా ప్లేట్ రూ.30కే అమ్ముతారు. కానీ 'వావ్ మోమోస్' ధర ప్లేట్ రూ.90. చౌకగా దొరికే వాటిని ఇంత ధర పెట్టి ఎవరు కొంటారు... అని మొదట్లో సాగర్‌ని చాలామందే విమర్శించారు. 'చౌకగా రోడ్డు వారన అమ్మే వాటి శుభ్రత గురించి మేం చెప్పలేం. ఖరీదైన మాల్స్‌లో ఈ తరహా స్ట్రీట్‌ఫుడ్ దొరకదు. రుచీ, ఆరోగ్యం... మాల్స్‌లో దొరుకుతాయంటే కాస్త ఎక్కువ ధర పెట్టి అయినా కొంటారు కదా! ఈ ఆలోచనతోనే పెద్ద మాల్స్‌లో కియాస్క్‌లు తెరిచాం. ఇబ్బందులు ఎదురైనా కొన్నాళ్లకు లాభాల బాట పట్టాం. మోమోబర్గర్, తందూరీ మోమోస్, సిజ్లర్ మోమోస్... అంటూ ప్రయోగాలు చేస్తూ కొత్త తరహా మోమోస్‌నీ, స్పైసీ చికెన్, నూడుల్స్ వంటి యాభై రకాల ఉత్పత్తులనీ మార్కెట్లోకి తీసుకొచ్చాం. మా ఆలోచన నచ్చి, ఎలివేషన్ క్యాపిటల్ వంటి సంస్థలు పదకొండువందల కోట్ల రూపాయల పెట్టుబడులని అందించాయి. అంతా బాగుందనుకున్న సమయంలో కొవిడ్‌తో మా దూకుడుకి పెద్ద బ్రేకే పడింది. ఆ సమయంలో మా దగ్గరకు ఎవరు వస్తారు? ఏం చేయాలో పాలుపోనప్పుడు ప్రజల దగ్గరకే మా ఉత్పత్తులు తీసుకెళ్లాలనుకున్నా. డెలివరీ చేసేటప్పుడు మోమోలు చెదిరిపోకుండా ఉండేలా రెడీటుకుక్ తరహాలో ప్యాకేజింగ్‌లో మార్పులు తీసుకొచ్చాం. ఈ మార్పు మా ఉత్పత్తులని ఇంటింటికీ చేర్చింది. ప్రస్తుతం 75 నగరాల్లో 750 అవుట్‌లెట్లని ప్రారంభించాం, ఆరువేలమంది ఉద్యోగులున్నారు. సంస్థవిలువ రూ.3 వేల కోట్లకి చేరింది. ఓటమి తాలూకు ఎమోషన్‌ని ఎవరు ఎలా మలుచుకున్నారు అనేదానిపైనే విజయం ఆధారపడి ఉంటుంది. బ్రేకప్, కొవిడ్ రెండింటినీ నేను అవకాశాలుగానే చూశా'నంటాడు సాగర్. ★

(c) eenadu



వీడియోకాల్‌లో మాట్లాడుకోవడం మనకి కొత్తేం కాదు... కానీ ఆ కాల్లో ఉన్న వ్యక్తి వీడియోలోంచి బయటకొచ్చి, మనపక్కన కూర్చుంటేనే విచిత్రం! అడవిలోకి వెళ్లి అక్కడి జంతువులని వీఆర్‌లో దగ్గరగా చూడటం కూడా మనకి అనుభవమే! కానీ ఆ జంతువులన్నీ మన ఇంట్లో తిరుగుతుంటేనే... 'ఏంటీ వింతా!' అని మన తల తిరుగుతుంది. హోలోగ్రాఫిక్ ప్రతిమలతో ఏది నిజమో.... ఏది భ్రమో తెలియనంతగా నట్టింట్లో మాయాలోకాన్ని సృష్టించడమే 'హోలోగ్రాఫిక్ టీవీ'ల గొప్పతనం...



హోలోగ్రాఫిక్ టీవీ కొనేస్తారా?

'ఉండీ లేకా ఉన్నది నీవే- ఉన్నా కూడా లేనిది నేనే'... ఏ సందర్భం లేకుండా ఇప్పుడేంటీ పాట అనుకోకండి. త్వరలో మన ఇళ్ళల్లోకి రాబోతున్న హోలోగ్రాఫిక్ టీవీల పనితీరుని చూశాక మీరూ ఇలానే అనకపోతే చూడండి. 'భలేవారే ఇప్పటికే త్రీడీ టీవీలు వచ్చాయి, వర్చువల్ రియాలిటీ(వీఆర్) హెడ్‌సెట్‌లని తలకి పెట్టుకుంటే అద్భుతమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. అంతకు మించి ఈ హోలోగ్రాఫిక్ టీవీలు చేసే అద్భుతం ఏంటో!' అని పెదవి విరిచేయకండి. త్రీడీ చిత్రాలకన్నా... వీఆర్ అద్భుతం కన్నా ఓ మెట్టుపైనే ఉంటుందీ హోలోగ్రాఫిక్ టీవీ లేదా డిస్‌ప్లే టెక్నాలజీ. ఈ సాంకేతికత కేవలం వినోదాన్నే కాదు... విద్య, వైద్య, కమ్యూనికేషన్ రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులని మోసుకొస్తోంది.

అద్దాలు అవసరం లేదు...

లేజర్, కాంతి కిరణాలతో పనిచేసే హోలోగ్రఫీ కొత్త టెక్నాలజీ కాకపోవచ్చు... కానీ దీనికి ఏఐ ప్రయోజనాలు తోడయ్యాక హోలోగ్రాఫిక్ టెక్నాలజీ రూపురేఖలే కాదు, ప్రయోజనాలూ మారిపోతున్నాయి. ఉదాహరణకు... మనం త్రీడీ చిత్రాలనీ, వీఆర్‌లో వింతలనీ చూడాలనుకుంటే తలకి బరువైన హెడ్‌సెట్‌లు పెట్టుకుంటాం. లేదంటే ప్రత్యేకమైన కళ్లద్దాలన్నా కావాలి. హోలోగ్రాఫిక్ టీవీలకు అవేమీ అవసరం లేదు. టీవీలోని పాత్రలని అసలైన త్రీడీ అనుభూతితో అవన్నీ మన ఇంట్లోకే వచ్చాయా అన్నంత వాస్తవంగా చూపిస్తాయివి. సంప్రదాయ టీవీల మాదిరిగా కాకుండా, ఈ బొమ్మలని మనం ఇంట్లో ఏ మూల కూర్చున్నా 360 డిగ్రీల కోణంలో చూడగలం. కేవలం చూసి సరిపెట్టుకోవడమే



కాకుండా... వీటిల్లోని ఇంటరాక్టివ్, టచబుల్ హోలోగ్రాఫిక్ టెక్నాలజీ కారణంగా ఆ బొమ్మలని తాకిన అనుభూతిని కూడా పొందవచ్చు. ఇందుకోసం అత్యాధునిక ఏఐ డ్రివన్ డెప్త్ మ్యాపింగ్, లేజర్ ప్రొజెక్షన్, నానో మెటీరియల్స్‌ని వాడి ఈ సరికొత్త టీవీలని తయారుచేస్తున్నారు.

అక్కడా మీరే... ఇక్కడా మీరే!

ఈ టీవీలు లేదా డిస్‌ప్లేలు అవసరానుగుణంగా పిల్లల్లో సృజనాత్మకతకు రెక్కలు తొడిగే స్టోరీ టెల్లింగ్ వేదికలుగానూ మారుతున్నాయి. ఎందుకంటే పిల్లలు టీవీల్లో వచ్చే కథల్లోని కోటలనీ, చిన్నారి నేస్తాలనీ, చెట్టుచేమలనీ తాకి గొప్పగా అనుభూతిని చెందొచ్చు. ఇక, పెద్దవాళ్లకు మీటింగ్‌లు జరుపుకొనే ఆఫీస్ రూమ్‌లు అవుతున్నాయివి. మీటింగ్‌కి మనం హాజరుకాకపోయినా మన నిలువెత్తు హోలోగ్రఫీ ప్రతిమను పంపి మనం అక్కడే ఉన్న అనుభూతిని కలిగించవచ్చు. అంటే ఆ మీటింగ్‌లో మనం లేకపోయినా ఉన్నట్టే. ఇక ఇంజినీరింగ్ విద్యార్థులు అయితే ఇంట్లోనే కూర్చుని కార్ ఇంజిన్‌ని చకచకా తయారుచేయొచ్చు. వైద్య విద్యార్థులు 'హోలోగ్రఫిక్ అనాటమీ క్లాసు'లకు హాజరై పరిశోధనలు చేయొచ్చు. ఎంత పెద్ద సంగీత విభావరి అయినా, అక్కడి గాయకులు మన హాల్లో సందడి చేస్తుంటే అంతకన్నా గొప్ప అనుభూతి మరొకటి ఉంటుందా!

సాధారణంగా ఏ సంస్థ అయినా- కొనడం, కొనకపోవడం తర్వాత మాట... ఒక్కసారి దుకాణానికి వచ్చి మా ప్రొడక్ట్‌ని చూసి వెళ్లిపోండి అంటుంది కదా! అలా మనం దుకాణానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఏ ఉత్పత్తిని అయినా ఇంట్లోనే కూర్చుని హోలోగ్రాఫిక్ పద్ధతిలో దగ్గరగా చూడొచ్చు. షూలు మొదలుకుని నగల వరకూ వేటినైనా ఇంటి నుంచే చూసి, తాకి ఫీల్ అయి కొనుగోలు చేయొచ్చు. అంతెందుకు మనం కొనబోయే ఇంటికి సంబంధించిన నమూనాలని కూడా ఈ హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేలు మన కళ్లముందు నిలువెత్తుగా చూపిస్తున్నాయి. వాయిస్, గెస్చర్ కంట్రోల్ సాయంతో మనకు కావాల్సిన విధంగా ఏ వస్తువునయినా దగ్గరగా చూసి కొనుక్కోవచ్చు. సోనీ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, క్వాల్‌కామ్ టెక్నాలజీస్, కోనికా, ఎన్విడియా, ప్రాజెక్ట్ ఎకో, హైపర్ వీఎస్‌ఎన్, ఏక్సీఎమ్ హోలోగ్రాఫిక్స్ వంటి సంస్థలు ఇప్పటికే ఈ అత్యాధునిక హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేలను తయారుచేస్తుంటే.... ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటివి తమకున్న సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని మరింత ముందుకు తీసుకెళ్తున్నాయి. ఈ టీవీలను కొన్ని సంస్థలు లిమిటెడ్ ఆఫర్లలో అందిస్తుంటే, కొన్ని ప్రీ ఆర్డర్లు పెట్టుకునే అవకాశమూ కల్పిస్తున్నాయి. ఒకప్పుడు స్టార్‌వార్స్‌లాంటి హాలీవుడ్ సినిమాల్లో ఈ హోలోగ్రాఫిక్ పాత్రలని చూసి 'ఆ.. అదంతా సైన్స్ ఫిక్షన్ మాయాజాలం' అని కొట్టిపారేశాం కానీ, అదే నేడిలా నిజమై మనమూ ఒక హోలోగ్రాఫిక్ పాత్రగా మారుతున్నామంటే ఆశ్చర్యంగా లేదూ! ★

(c) eenadu

చల్లటి గాలులు గిలిగింతలు పెట్టే అద్భుతమైన శీతకాలపు ఉదయాలతోపాటు, ఆ కాలంలో వచ్చే అనారోగ్య సమస్యలూ అధికమే. వెచ్చదనపు మాధుర్యాన్ని చూపించే చలి సాయంత్రాలకు జతగా, వైరస్‌ల దాడి కూడా ఎక్కువే. అందుకే, చలికాలంతో వచ్చే ఆ ఇబ్బందులన్నింటినీ తిప్పికొట్టాలంటే శరీరానికి రక్షణ కవచం కావాల్సిందే. అందుకు ప్రతి కణాన్నీ రక్షించే ‘విటమిన్-సి’ని ఆహారంలో చేర్చుకోవాల్సిందే. ఇంతకీ ఈ సూపర్ విటమిన్‌ని అందించే పదార్థాలేంటీ... ఆరోగ్యానికి ఇది చేసే మేలేంటీ... మొత్తంగా దీని కథాకమామీషు అంతా తెలుసుకుందాం పదండి...





విటమిన్-సి... చలికాలంలో శ్రీరామ రక్ష!

ఇదివరకు నావికులు సముద్రాల్లో నెలల తరబడి ప్రయాణించేవాళ్లు కదా. వాళ్లలో కొందరు చలికాలంలో తీవ్రమైన వ్యాధులకు గురయ్యేవాళ్లట. గాయాలు మానకపోవడం, అలసటగా ఉండటం, శరీరం బలహీనమవ్వడం, వెంటవెంటనే జబ్బు పడటం లాంటి సమస్యలు తరచూ కనిపించేవట. ఆ లక్షణాల్ని గమనించిన ఒక ఆంగ్ల వైద్యుడు దానికి ఓ మందు కనుగొన్నాడు. ఆ మందు పేరే విటమిన్-సి. అందుకే ఆ ఔషధాన్ని అందించే నారింజ, నిమ్మ, ఉసిరి... లాంటి సిట్రస్ ఫ్రూట్స్‌ని తినడం వల్ల శీతకాలంలో వచ్చే ఆ అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టడం ఆరంభించారు. 18వ శతాబ్దంలో జరిగిన ఈ సంఘటనతో వ్యాధినిరోధక శక్తిని పెంచడంలో విటమిన్-సి పాత్ర ఎంత ఉందో అందరికీ తెలిసింది. చలికాలంలో తప్పనిసరిగా విటమిన్-సి అవసరం అవుతుంది కాబట్టే, వాతావరణం చల్లబడగానే వచ్చే రకరకాల పండ్లూ, కూరగాయలూ, ఆకుకూరలన్నింట్లో ఆ విటమినే ఎక్కువ ఉంటుంది. ప్రకృతి ప్రసాదించిన ఈ సూపర్ డైట్‌ని ఒక నెల ముందు నుంచే మొదలుపెట్టామంటే- ఆ ఆహారమే శరీరాన్ని కాపాడే దివ్యౌషధం అవుతుంది!

అసలు ఏంటీ విటమిన్-సి...

మన ఆరోగ్యానికి అవసరమైన పోషకాల్లో ముఖ్యమైంది విటమిన్-సి. శరీరంలోని అన్నిరకాల పనుల్లో పాలు పంచుకుంటూ రోగనిరోధక శక్తిని పెంచుతూ, రక్షణ కవచంగా మారుతుంది ఇది. నీటిలో కరిగిపోయే ఈ విటమిన్- శరీరంలో నిల్వ ఉండదు. ఇదుండే ఆహార పదార్థాల్ని రోజూ తింటేనే దీని వల్ల కలిగే లాభాల్ని పొందొచ్చు.

★ ముఖ్యంగా చలికాలంలో నెమ్మదించే జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది ఇది. ఇంకా శరీరం ఐరన్‌ను శోషించే శక్తినీ విటమిన్-సి పెంచుతుందట.

★ ఇమ్యూన్ బూస్టర్‌లా పనిచేసే ఈ విటమిన్- చర్మానికి అవసరమైన తేమను అందిస్తూ పొడిబారకుండా చేస్తుంది, శరీర ఉష్ణోగ్రతల్ని నియంత్రిస్తుంది.

★ వైరస్‌లతో పోరాడే తెల్లరక్తకణాల్ని బలోపేతం చేస్తూ, శరీరం- వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. రకరకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి పోరాడే శక్తి దీని సొంతం.

★ విటమిన్-సి... చర్మం, రక్తనాళాలూ ఆరోగ్యంగా ఉండటానికి అత్యవసరమైన కొలాజెన్ ప్రొటీన్‌నీ తయారుచేస్తుంది.


★ ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతూనే ప్రమాదాల్లో ఎముకలు విరగకుండా కాపాడుతుంది. అంతేకాదు, బోన్ రిపేర్‌లోనూ ఇది పాలు పంచుకుంటుంది.


★ విటమిన్-సి శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ కూడా. క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకోవడంలో ముందు ఉంటుంది. గుండె జబ్బుల్ని అరికడుతూనే రక్తపోటునూ క్రమబద్ధీకరిస్తుంది.

★ గాయాల్నీ, వాటి ద్వారా అయ్యే మచ్చల్నీ మాన్పుతూ చర్మ కణాల్ని బాగుచేస్తుంది విటమిన్-సి. జపాన్ శాస్త్రవేత్తలు చేసిన ఓ పరిశోధనలో విటమిన్-సి కేవలం చర్మ నిగారింపుకు మాత్రమే కారణం కాదనీ డీఎన్‌ఏలో మార్పులు జరిపి, ఎక్కువకాలం మనల్ని యవ్వనంగా ఉంచుతుందనీ బయటపడింది.

★ కంటి ఆరోగ్యానికీ ఈ విటమిన్ అవసరమే. కంటి సమస్యల్ని దరి చేరనివ్వదు. హార్మోన్ల అసమతుల్యతను నియంత్రించడంలోనూ ఇది ముఖ్యమైన పాత్రను పోషిస్తుందట.

★ విటమిన్-సిని ‘హ్యాపీ విటమిన్’ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే మానసిక ఆరోగ్యానికీ దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పరిశోధనల్లో బయటపడింది. ఒత్తిడీ, ఆందోళనల్ని తగ్గించి హుషారును తీసుకొస్తుందట ఇది. దీని లోపంతో ఉన్నవాళ్లు నిరాశగా, అలసటతో ఉన్నట్లు అధ్యయనాల్లో తేలింది.





★ మెదడు పనితీరును సరిచేస్తూ వయసుతోపాటు వచ్చే జ్ఞాపకశక్తికి సంబంధించిన సమస్యల్ని రాకుండా చూస్తుంది.

★ కూరగాయలూ, పండ్ల ద్వారా శరీరంలోకి చేరిన పురుగు మందుల్నీ, ఒంట్లోని ఇతర హానికరమైన విష పదార్థాల్నీ విటమిన్-సి బయటకు పంపించేస్తుంది.

ఏయే పదార్థాల్లో ఉంటుంది...

విటమిన్-సి అనగానే ముందుగా గుర్తొచ్చేది కమలాలూ, నిమ్మలాంటి సిట్రస్ ఫ్రూట్సే. కానీ అత్యధికంగా ఉసిరి ద్వారా ఈ విటమిన్ అందుతుంది. వంద గ్రాముల ఉసిరి పండ్లలో 600 నుంచి 700 మిల్లీ గ్రాముల విటమిన్-సి ఉంటుంది. వ్యాధులకు కళ్లెం వేసే ఉసిరిని సర్వరోగ నివారిణిగా అందుకే చెబుతారు. ఇంకా జామ, బొప్పాయి, పైనాపిల్, కివీ, స్ట్రాబెర్రీల్లోనూ విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది. కూరగాయల్లో పసుపు-ఎరుపు-ఆకుపచ్చ బెల్ పెప్పర్ల ద్వారా విటమిన్-సి సమృద్ధిగా దొరుకుతుంది. ఒక పెద్ద సైజు ఎల్లో పెప్పర్‌లో 342 మిల్లీగ్రాముల విటమిన్-సి ఉంటుందట. ఇంకా బ్రకోలీ, క్యాబేజీ, కాలీఫ్లవర్, మిరప, పాలకూర ఇతర ఆకుకూరల్లోనూ ఇది దండిగానే ఉంటుంది.

రోజుకు ఎంత తీసుకోవాలి...

వయసును బట్టి విటమిన్-సి అవసరం ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. పసిపిల్లలకు 40 నుంచి 50 మిల్లీగ్రాములు అవసరమైతే, పెద్దవాళ్లకు దాదాపు 100 మిల్లీగ్రాముల విటమిన్-సి కావాలి. గర్భిణులూ, బాలింతలూ ఇంకాస్త ఎక్కువ మోతాదులోనే తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఉన్న ఆహారపు అలవాట్లూ, పెరుగుతున్న వైరస్‌లను దృష్టిలో పెట్టుకుని అందరూ అధిక మొత్తంలో విటమిన్-సి తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ట్యాబ్లెట్లూ వచ్చాయి....

ఆహారం ద్వారా తగినంత విటమిన్-సి అందకపోతే- శరీర రక్షణ వ్యవస్థ దెబ్బతిని రకరకాల వ్యాధులు చుట్టుముడతాయి. ముఖ్యంగా ఈ మహా పోషక లోపం వల్ల స్కర్వీ వ్యాధి వస్తుంది. కొలాజెన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. కీళ్లనొప్పులూ, చిగుళ్ల రక్తస్రావం లాంటివి ఎదురవుతాయి. దీనికి మందుగా మొదటిసారి 1930ల్లో విటమిన్-సిని ట్యాబ్లెట్ల రూపంలో తెచ్చారు. పౌడర్ ప్యాకెట్లనీ తయారుచేశారు. ప్రస్తుతం పిల్లలు మెచ్చే రుచుల్లోనూ విటమిన్-సి చాక్లెట్లూ, జెల్లీలూ మార్కెట్లో కనిపిస్తున్నాయి. డాక్టర్ సలహా తీసుకుని చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరూ రోజూ వీటిని వాడుకోవచ్చు.



ఎన్ని ఉత్పత్తులలో...

చర్మ నిగారింపుకు చిరునామా కచ్చితంగా విటమిన్-సి అనే చెప్పొచ్చు. చర్మానికీ, జుట్టుకీ దీని వల్ల ఎన్నో ఉపయోగాలున్నందున సౌందర్యోత్పత్తుల్లోనూ ఈ విటమిన్‌ను విరివిగా వాడుతున్నారు. షాంపూ మొదలు ఫేస్ సీరమ్స్ వరకూ ఈ విటమిన్‌తో ఎన్నో ప్రొడక్ట్స్ కూడా వస్తున్నాయి.

‘చికిత్స కన్నా నివారణ చౌక’ అన్నమాట విటమిన్-సి విషయంలో సరిగ్గా సరిపోతుందంటే నమ్మండి. రోజూ పొద్దున్నే నిమ్మకాయ రసమో, చిన్న ఉసిరి ముక్కనో, సీజన్లో దొరికే పండ్ల రసాల్నో, పెప్పర్, బ్రకోలీ లాంటి కూరగాయల్నో ఆహారంలో చేర్చుకున్నారంటే శరీరం మొత్తానికీ రక్షణ కవచంలా పనిచేసే విటమిన్-సి మన తోడున్నట్టే. కానీ ఆ చిన్న విషయాన్ని అశ్రద్ధ చేయడం వల్ల మన దేశంలో దాదాపు 75శాతం వరకూ ఈ సూపర్ విటమిన్ లోపంతో బాధపడుతున్నారట! ★



(c) eenadu

నిరుపేదలకోసం ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నా... అన్నిచోట్లా సరైన వైద్యసాయం అందుతుందని చెప్పలేం. ఆ పరిస్థితిని గుర్తించిన కొందరు అలాంటి పేదలకు మెరుగైన చికిత్స అందించేందుకు ఏం చేస్తున్నారంటే...

పేదలకు ఆరోగ్యసాయం!





ఆసుపత్రి నిర్మించి...

జబ్బు ముదిరితే తప్ప ఆసుపత్రికి వెళ్లరు చాలామంది పేదలు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చి, పేదలకు ఎప్పటికప్పుడు సరైన వైద్యం అందించేందుకు ప్రారంభించిన వైద్యకేంద్రమే తిరుమలై మిషన్ ఆసుపత్రి. తిరుమలై చారిటీ ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే ఈ ఆసుపత్రిలో దాదాపు అన్ని సేవలూ ఉచితమే. తమిళనాడు, రాణిపేటలోని ముత్తుకడైలో ఉండే ఈ ఆసుపత్రి ద్వారా చుట్టుపక్కల ఉన్న సుమారు మూడువందల గ్రామాల పేదలకు నిరంతరం వైద్య సాయం అందుతోంది. ఏ చిన్న అనారోగ్యం వచ్చినా ఆసుపత్రికి వచ్చే పేదల సంఖ్య వందల్లో ఉంటే... అదనంగా ఆసుపత్రి సిబ్బంది - మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, కంటి సమస్యలు, ఆస్టియోపోరోసిస్, గైనిక్ సమస్యలు, దంత సమస్యలు, రొమ్ము- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను ముందే గుర్తించేందుకు తరచూ వైద్య శిబిరాలనూ నిర్వహిస్తారు. అవసరమైనవారికి శస్త్రచికిత్సలు కూడా చేసే ఈ ఆసుపత్రిలో ప్రత్యేకంగా వలంటీర్లు కూడా ఉంటారు. వీళ్లు, ఎప్పటికప్పుడు రోగుల ఇళ్లకు వెళ్లి, వాళ్ల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తూనే ముందు జాగ్రత్తలూ సూచిస్తారు. ప్రభుత్వంతోపాటు, ఇతర ప్రైవేటు సంస్థలతోనూ అనుసంధానమైన ఈ ఆసుపత్రిని తమిళనాడుకు చెందిన ఎన్.ఎస్. అయ్యంగార్ కుటుంబం నిర్వహిస్తోంది.





ఈ-క్లినిక్‌లు ఏర్పాటు చేసి...

చిన్న అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లినా, డాక్టర్ ఫీజుతోపాటు మందులు కొనడానికి ఎంతలేదన్నా వెయ్యి నుంచి పదిహేనువందల రూపాయల వరకూ వదిలిపోతాయనేది ఒప్పుకోవాల్సిందే. ఆ మాత్రం కూడా ఖర్చుపెట్టలేని పేదల పరిస్థితి ఏంటని ఆలోచించింది సత్య మైక్రో క్యాపిటల్ లిమిటెడ్ సంస్థ. అందుకే కొవిడ్ సమయంలో పేదలకోసం సత్యశక్తి పేరుతో ఫౌండేషన్‌ను ఆరంభించి ఉచితంగా వైద్యసాయం అందించడంతోపాటు మందులూ పంపిణీ చేయడం మొదలుపెట్టింది. క్రమంగా దిల్లీతోపాటు ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి చోట్ల ఈ- క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. వీటిద్వారా పేదలు ఎవరైనా నామమాత్రపు రుసుముతో తమకు వచ్చిన భాషలోనే వైద్యసాయం తీసుకోవచ్చు. ఈ- క్లినిక్‌లకు దూరంగా ఉండేవాళ్లు ఫోన్‌కాల్ ద్వారా డాక్టర్‌తో తమ సమస్యను విన్నవించుకునేలా ప్రత్యేకంగా డిజిటల్ ఓపీడీనీ అందుబాటులోకి తీసుకొచ్చింది. వైద్యులు సూచించిన మందులు కూడా మళ్లీ డబ్బు పెట్టి కొనకుండా 'దవాయి సేవ' పేరుతో ఉచితంగా అందిస్తుంది సంస్థ. ఇక, మహిళలకు నెలసరి సమయంలో అవసరమయ్యే శానిటరీ ప్యాడ్లను ఉచితంగా ఇచ్చేందుకు ఈ-క్లినిక్‌లలోనే శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మెషీన్లనూ ఏర్పాటు చేయడం గమనార్హం. వీటన్నింటి ద్వారా ఇప్పటివరకూ కొన్ని వేల మంది లబ్ధిపొందారని చెబుతారు ఈ సంస్థ వ్యవస్థాపకులు శిఖాశర్మ, వివేక్ తివారి.

ఇంటివద్దకే వైద్యం





ఆరోగ్యం పైన సరైన అవగాహన లేకపోవడం, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం, ఆర్థిక పరిస్థితులు... తదితర కారణాలతో చాలామంది పేదలూ, గ్రామీణులూ ఎక్కువగా అనారోగ్యాల బారిన పడుతుంటారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలూ వీళ్లకే ఎక్కువ నేది తెలిసిందే. ఇలాంటివారికి ఇంటివద్దకే వైద్యసాయం అందించాలనే ఉద్దేశంతో కర్ణాటకకు చెందిన ఆవాహన్ అనే స్వచ్ఛంద సంస్థ అన్నిరకాల సదుపాయాలతో 'హెల్త్‌ఆన్ వీల్స్'ను అందుబాటులోకి తెచ్చింది. అంటే... ఏడెనిమిది మెడికల్‌వ్యాన్లు ప్రతిరోజూ కర్ణాటక చుట్టుపక్కల ప్రాంతాల్లోని గ్రామాలకూ, మురికివాడలకూ వెళ్తాయి. ఆ వ్యాన్లలో ఉండే వైద్యులు అక్కడివారి సమస్యలు తెలుసుకుంటూనే అవసరం మేరకు రక్త, మూత్ర పరీక్షలూ నిర్వహిస్తారు. సమస్యను బట్టి మందులు కూడా ఉచితంగా ఇచ్చే ఈ సేవా సంస్థ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలిసిస్ యంత్రాలు, ఆక్సిజన్ ప్లాంట్లు వంటివీ ఏర్పాటు చేస్తోంది. ఈ హెల్త్‌ఆన్‌వీల్స్ ద్వారా ఇప్పటివరకూ లక్షమంది పేదలకు వైద్య సాయం అందిందని చెబుతారు దీని నిర్వాహకులు బ్రజ కిశోర్ ప్రధాన్. కర్ణాటకకు చెందిన ఇన్ఫినెరా అనే సంస్థతో కలిసి ఆవాహన్ ఈ సేవల్ని నిర్వహిస్తోంది.

(c) eenadu



మనమంతా అమితాశ్చర్యంతో చూసిన వార్త అది... 'అల్బేనియా దేశం ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ఓ ఏఐ మంత్రిని నియమించింది' అన్నది దాని సారాంశం. ఈ మంత్రి అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతుందన్నది అందులోని విశేషాంశం. అల్బేనియా... యూరప్ ఖండంలో గ్రీస్‌కి ఉత్తరాన ఉన్న ఓ చిన్నదేశం. అయితేనేం, అవినీతి వ్యతిరేక పోరాటంలో పెద్ద ఎత్తున ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రజలు నడుంబిగిస్తే... ఓ దేశ ముఖచిత్రాన్నే ఎంతగా మార్చగలరో చెబుతోంది. ఆ స్ఫూర్తి చరిత్ర మీరే చూడండి...



అవినీతిపై పోరాటానికి ఏఐ మంత్రి!

ఆకలి... కాకుంటే అర్ధాకలి! రోజుకి ఒక్కపూట భోజనమే గగనం వాళ్లకి. 'అన్నమో రామచంద్రా...' అని అరవడానికీ వీల్లేదు. ఆ అరుపుని ప్రభుత్వ వ్యతిరేక గళంగా భావించి ఉరితీసేవాడు ఒకప్పటి అల్బేనియా అధ్యక్షుడు ఎన్వర్ హోజా! కాస్త తక్కువ శిక్ష అంటే... దేశబహిష్కరణ చేసేవాడు. ఆ దేశంలో 1940 నుంచి యాభై ఏళ్లపాటు చోటుచేసుకున్న అరాచక పాలన అది. 1950ల్లో ప్రజాపోరాటాలతో ఆ రాక్షస పాలన నుంచి విముక్తి లభించి... ప్రజాస్వామిక రాజ్యాంగం ఏర్పడినా... అది కంటి తుడుపుగానే మారింది. నయా పారిశ్రామిక విధానాలతో దేశంలోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడ్డ డబ్బు... నేరుగా పాలకుల జేబుల్లోకే వెళ్లసాగింది. ప్రజలు ఇంకొంత ధైర్యాన్నీ చైతన్యాన్నీ కూడగట్టుకోవడానికి... మరో 15 ఏళ్లు పట్టింది. ఆ ప్రజల నుంచే ఎడీ రామా అనే నాయకుడొచ్చాడు.
ఆ మోడర్న్ ఆర్టిస్టు కాస్తా... విద్యార్థుల్ని కూడగట్టి పోరాటాలు చేశాడు. 2013లో సోషల్‌పార్టీ తరపున ప్రధాని అయ్యాడు. వచ్చీరాగానే ప్రక్షాళన మొదలుపెట్టాడు. అప్పట్లో చుట్టుపక్కల ఉన్న దేశాలు అల్బేనియాని 'యూరప్ ఖండానికి ఇదో దిష్టిచుక్క' అని వెక్కిరించేవి. దాంతో అవినీతిలో



భాగమైపోయిన న్యాయ, పోలీసు వ్యవస్థల్ని ప్రక్షాళన చేయడం మొదలుపెట్టాడు రామా. మూడింట రెండొంతుల మంది జడ్జీలనూ పోలీసు అధికారులనూ తొలగించాడు. వీటన్నింటికీ తలమానికంగా స్పెషల్ స్ట్రక్చర్ ఎగైనెస్ట్ కరప్షన్ అండ్ ఆర్గనైజ్డ్ క్రైమ్(స్పాక్)ని 2019లో ఏర్పాటుచేశాడు! అది ఒక్క అల్బేనియాలోనే కాదు... మొత్తం యూరప్ ప్రజల నుంచీ ప్రశంసలు అందుకుంటోంది. ఎందుకంటే...

ఎవరూ అదుపుచేయలేరు!

బయట నుంచి నియంత్రణేదీ లేకుండా... అవినీతిపైన పోరాడే స్వతంత్ర వ్యవస్థే ఈ 'స్పాక్'. ఈ సంస్థ తన కార్యకలాపాలని మొదలుపెట్టిన కొన్నాళ్లకే అల్బేనియా మాజీ అధ్యక్షులు ఇద్దర్ని జైల్లో పెట్టింది. 'మామీద ద్వేషంతోనే ప్రధాని స్పాక్‌తో ఇలా చేయిస్తున్నాడు' అని ఆరోపించాయి ప్రతిపక్షాలు! కానీ 'స్పాక్' పాలక పక్షాన్నీ వదిలిపెట్టలేదు. స్వయంగా ప్రధానికి చెందిన సోషల్‌పార్టీ ఉపాధ్యక్షుణ్ని ఓ కేసులో సాక్ష్యాల్ని తారుమారు చేశాడన్న ఆరోపణలతో అరెస్టు చేసింది. కొందరు ఎంపీలనీ కారాగారంలో వేయించింది. వీటన్నింటికీ పరాకాష్ఠ... ప్రధానికి అత్యంత సన్నిహితుడైన- అల్బేనియా రాజధాని టినారా నగర మేయర్‌ని కారాగారంలో పెట్టడం! అతనూ అతని భార్యా ఎన్జీఓ పేరుతో స్థిరాస్తి వ్యాపారుల నుంచి లంచాలు దండుకున్నారని నిరూపించి బెయిల్ కూడా రానివ్వకుండా జైల్లో పెట్టింది స్పాక్! ఆ పరిణామాన్ని ప్రధాని కూడా ఊహించలేదు. 'ఇది మానవహక్కుల హననం' అంటూ ఆయన స్పాక్‌పైన విమర్శలకి దిగాడు. 'ప్రధానిగారూ! మీ వ్యాఖ్యల్ని వెనక్కితీసుకోండి' అంటూ స్పాక్‌కి మద్దతుగా ప్రజలే ఊరేగింపులు చేశారంటే చూసుకోండి!

ప్రజలే కీలకం...

'మరి స్పాక్‌ని అదుపుచేసే అధికారం ఎవరికీ లేనప్పుడు ఈ కేసులు పెట్టమని దాన్ని ఎవరు పురమాయించారు?' అంటారా... స్వయంగా ప్రజలే! ఔను... ప్రజలు నేరుగా స్పాక్‌కి ఫిర్యాదు ఇవ్వొచ్చు. వాళ్ల సమాచారంతో రహస్యంగా ముందుకెళ్లి అవినీతి భరతం పడుతుంది. తాను ప్రజలకు మాత్రమే జవాబుదారీనని ప్రకటిస్తుంది.

ఏడాదికోసారి అంతర్జాతీయ సంస్థల చేత ఆడిట్ చేయించి ఆ నివేదికని ప్రజల ముందు పెడుతుందా సంస్థ! ఒకప్పుడు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సూచీలో 98వ స్థానంలో ఉండేది అల్బేనియా! స్పాక్ వల్ల 80వ స్థానానికి వచ్చింది.

అందులో భాగమే...

ఆ మధ్య అల్బేనియాలో ఓ సర్వేలో 'మేము రాజకీయ నాయకులకన్నా స్పాక్‌నే ఎక్కువగా నమ్ముతున్నాం' అని 76 శాతం మంది ప్రజలు చెప్పారట! ఆ తిరుగులేని మద్దతుతోనే స్పాక్ అవినీతి వ్యతిరేకపోరాటంలో 'డీయెలా' అనే ఏఐ మంత్రిని డిజైన్ చేసింది. స్పాక్‌కున్న ప్రజామద్దతు కారణంగా ప్రభుత్వమూ దాన్ని అంగీకరించింది. అలా, ప్రపంచంలోనే తొలిసారి దానికి కేబినెట్ హోదా కూడా అందించారు. స్త్రీ రూపంలో ఉన్న ఏఐ మంత్రి ఇది. అల్బేనియాలో 60 శాతం అవినీతి ప్రైవేటు సంస్థల నుంచి ప్రభుత్వం కొనే వస్తువుల (ప్రొక్యూర్‌మెంట్స్)లోనే జరుగుతుంది కాబట్టి ప్రస్తుతం దానిపైనే ప్రధానంగా దృష్టి పెడుతోందట... డీయెలా! ★

(c) eenadu

కథ

స్వాభిమానం

– ఎం.వెంకటేశ్వర రావు

వచ్చి మూడు రోజులవుతున్నా అన్న శేఖర్‌కిగానీ వదిన పద్మజకిగానీ తనెందుకొచ్చిందీ ఒక్క మాట కూడా చెప్పలేదు అనూజ. తనకి పెళ్ళయి మూడేళ్ళయింది. భర్తతో కాకుండా ఇలా సడన్‌గా ఒక్కతే రావడం ఇదే మొదటిసారి.

నాలుగో రోజు ఇక ఆగలేక "అనూ, వినయ్ ఎలా ఉన్నాడు?" అంది పద్మజ.

"ఆయనకేం, మహారాజులా ఉన్నాడు" అంది నిర్లక్ష్యంగా.

"రేపు ఆదివారమేగా, వినయ్ వస్తున్నాడా?"

"వస్తాడో రాడో నాకూ తెలియదు వదినా."

"ఫోన్ చేసి కనుక్కోవచ్చుగా."

"చేశాను. లిఫ్ట్ చేయటం లేదు. బిజీగా ఉన్నాడేమో!"

ఇంకా అక్కడే ఉంటే వదిన ఇంకేమైనా అడుగుతుందేమోనని... "తలస్నానం చేసి వస్తాను వదినా" అని బాత్‌రూమ్‌కి వెళ్ళింది అనూజ.

'పిల్లి కళ్ళు మూసుకుంటే... పగలు చీకటి అవుతుందా? సమస్య ఏమిటో చెప్పకుండా... తనలోనే దాచుకుంటే పరిష్కారం ఎలా దొరుకుతుంది? వాళ్ళ అన్నకి కానీ తనకి కానీ చెప్పకుండా... సమస్య నుండి పారిపోదామనుకోవటం పిరికితనం కాదా' అనుకుంది పద్మజ.

అనూజని రెట్టించి అడిగితే ఏం తప్పుగా అర్థం చేసుకుంటుందో అనుకుంది పద్మజ.

అంతలో భర్త శేఖర్ వచ్చాడు. అతను ఫ్రెష్ అయ్యి వచ్చేసరికి పద్మజ ముగ్గురికీ భోజనాలు పెట్టింది.

పద్మజ కిచెన్ సర్దుకుంటుంటే... అనూజ తన గదికి వెళ్ళింది.

పది నిమిషాల తర్వాత ఛార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్ కోసం హాల్లోకి వచ్చింది అనూజ.

ఆ సమయంలో గదిలో అన్నా వదినా మాట్లాడుకుంటున్నారు. అనూజకి మిగతా వాళ్ళ మాటలు వినే అలవాటు లేదు. ఫోన్ తీసుకుని వెళ్ళబోతుంటే... అన్నా వదిన మాటల్లో తన పేరు వినిపించి ఒక్క క్షణం ఆగింది.

"అనూ ఏమైనా చెప్పిందా పద్మా" అన్నాడు శేఖర్.

"మీకు చెల్లెలేగా, మీరే అడగొచ్చు. ఊరికినే రెండు రోజులు అన్నయ్య ఇంట్లో ఉందామని వచ్చిందేమో" అంది పద్మజ.

"వచ్చినందుకు నేనేం అనటంలేదు. ఎప్పుడూ గలగలా మాట్లాడే తను- వచ్చిన దగ్గరనుంచీ నీతోగానీ నాతోగానీ సరిగ్గా మాట్లాడటం లేదన్నదే నా బాధ."

"అనూజ చాలా సెన్సిటివ్... అయినా, తనంతట తనేం చెబుతుంది?"

"...అలా అనే మూడు రోజులు ఓపిక పట్టాను. నిన్ను కనుక్కోమంటే... నువ్వు అడగటం లేదు. తన మౌనానికి కారణమేమిటో కనుక్కునే అవకాశమే అనూ ఇవ్వటం లేదు. ఏదో బాధ పడుతోందనిపించింది. అందుకే ఇవాళ వినయ్‌కి ఫోన్ చేశాను."

"మాట్లాడాడా? ఇద్దరిమధ్యా ఏదైనా గొడవ జరిగిందా?" ఉత్సుకతతో అంది పద్మజ.

"ఏదో గొడవ జరిగిందట. మాటామాటా అనుకుని, చినికి చినికి గాలి వానలా మారి... నువ్వంటే నువ్వనుకునే వరకూ వెళ్ళిందట. ఇద్దరిమధ్యా ఈగో తలెత్తడంతో... వినయ్‌కి చెప్పకుండానే ఇంట్లో నుంచి వచ్చేసిందట. అనూజదే తప్పన్నట్టు అతను మాట్లాడాడు."

"ఇద్దరూ చాలా అన్యోన్యంగా ఉంటారు కదా... అసలు గొడవకి కారణం ఏంటో?"

"అతనికి బిజినెస్‌లో ఏదో నష్టం వచ్చిందట. ఆ చికాకుల్లో ఉన్నాడట. ఆ విసుగులో ఏదైనా అన్నాడేమో... అర్థం చేసుకోకుండా మాటకి మాట అనుకుని... పంతాలకు పోతే ఎలా కుదురుతుంది చెప్పు?"

"ఇప్పుడు ఏం చేద్దామంటారు?"

"మనమూ ఏమీ తెలియనట్టే ఉందాం. రేపు అనూజని శేఖర్ దగ్గరికి వెళ్ళమని చెప్పు. సమస్య అదే సర్దుకుంటుంది" అన్నాడు శేఖర్.

గది బయట నిలబడ్డ అనూజ మనసు విలవిల్లాడింది. ఏనాడూ ఇలా మాట్లాడని అన్నయ్య, తప్పంతా తనదే అన్నట్టు మాట్లాడటం నచ్చలేదు. పైగా రేపే వెళ్ళాలని చెప్తున్నాడు. నాకు నాలుగు రోజులు అన్నయ్య ఇంట్లో ఉండే హక్కు లేదా" అనుకుంటుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏంటి పద్మా, మాట్లాడవు?" అన్నాడు శేఖర్.

"ఏం మాట్లాడను? అనూతో ఏమని చెప్పాలి... ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు."

"సమస్య పెద్దది కాకముందే... భర్త దగ్గరికి వెళ్ళమని చెప్పు."

"వెళ్ళమని నేను ఎలా చెప్పను? మనకీ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారన్న సంగతి మర్చిపోకండి. తను మీకు చెల్లెలు, ఈ ఇంటి ఆడపడుచు. ఏదో సమస్య వల్ల ఇక్కడికి వచ్చింది. అన్నయ్య దగ్గరకి రాకుండా మరెక్కడికి వెళుతుంది?" అంది పద్మజ.

"తనని రావద్దనో ఇంకెక్కడికో వెళ్ళమనో నేను అనటం లేదు. భర్తతో గొడవపడి ఇలా రావడం బాగాలేదు అంటున్నాను."


"చూడండీ, మొదట్లో మనిద్దరం మాత్రం తగవులాడుకోలేదా... నేను అలిగి మూతి బిగించుకుని కూర్చోలేదా? ఇవన్నీ మొగుడూ పెళ్ళాల మధ్య సహజం. అవే సర్దుకుంటాయి" అంది పద్మజ.

"నిజమే. కానీ మన తగాదాలు నాలుగు గోడల మధ్యనే వచ్చి పోయేవి. ఇలా చుట్టుపక్కల వాళ్ళకి తెలిసి... నలుగురూ నవ్వుకునేలా ఏనాడూ జరగలేదే. వినయ్ ముందు నిలబడటానికి కూడా అర్హత లేని వాళ్ళు వచ్చి అతనికి బుద్ధులు చెప్తుంటే అతనికి ఎలా ఉంటుందో చెప్పు."

"ఎంతసేపూ పొరుగింట్లో ఏం జరుగుతోందో అని ఆరా తీయడం, ఉన్న విషయానికి చిలవలు పలవలు కల్పించి నలుగురికీ చెప్పడం కొంతమందికి అలవాటు. అలాంటి వాళ్ళని ఎక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి. అలాంటి గురివిందలు తమకు నలుపే లేదన్నట్టు మాట్లాడతారు. వాళ్ళ మాటల్ని పట్టించుకుంటే... నష్టపోయేది మనమే."

"నిజమే... ఇప్పుడేం చేద్దాం?"

"కంగారు పడకండి. ప్రతి సమస్యకీ



(c) eenadu

ఓ పరిష్కారం ఉంటుంది. నెమ్మదిగా అనూజతో మాట్లాడదాం. తను మనసు కష్టపెట్టుకుని ఇక్కడికి వచ్చింది. తనని మనమే అర్థం చేసుకోవాలి. వాళ్ళిద్దరిమధ్యా ఏం జరిగిందో తెలుసుకుని సమస్యకి పరిష్కారం చూపించే బాధ్యత మన ఇద్దరిదీ. తనకి మనం అన్నావదినలం మాత్రమే కాదు... అమ్మానాన్నల్లా కడుపులో పెట్టుకుని ఆదరించాల్సిందీ మనమే" అంది పద్మజ.

గది బయట అనూజ మౌనంగా వింటోంది.

పద్మజ మాట్లాడుతూ "కోర్టులో కూడా ఇరుపక్షాల వాదనలూ విన్నాకే తీర్పు చెప్తారు. మీరు వినయ్ చెప్పిందే విని అనూజదే తప్పని తీర్మానించడం సబబు కాదు. మగాళ్ళకే సమస్యలూ చికాకులూ బాధలూ ఉంటాయా? అలాంటి సమయంలో వాళ్ళు ప్రదర్శించే కోపం విసుగూ భార్యలే భరించాలా? అనూజ కూడా ఎమ్మెస్సీ వరకూ చదువుకుంది. కార్పొరేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. తనకీ సమస్యలూ వర్క్ టెన్షన్‌లూ ఉండవా? వాటినీ తనే భరించాలా, ఇదెక్కడి న్యాయం" అంది పద్మజ.

శేఖర్ మౌనంగా వింటున్నాడు.

"నేను మీ భార్యగా ఈ ఇంటికి వచ్చేసరికి అనూజ- తల్లి లేని చిన్నపిల్లండీ! ఇదే మన పిల్లలకి జరిగితే ఇలాగే అంటామా? రేపు ఆలోచించవచ్చు... పడుకోండి" అంది పద్మజ- తనూ పడుకుంటూ.

గది బయట నిలబడ్డ అనూజ తన గదికి వెళ్ళి తలుపేసుకుంది. నిద్ర పట్టడంలేదు. ఆమె ఆత్మాభిమానం కళ్ళని తడి చేస్తోంటే, మనసు గతంలోకి వెళ్ళింది.

★ ★ ★

అనూజది యావరేజ్ అందమే. బుద్ధిశాలి. అణకువతోబాటు స్వాభిమానం ఎక్కువ. వ్యక్తిత్వంలో తనకు తానే సాటి అని కచ్చితంగా చెప్పొచ్చు.

వినయ్ చాలా తక్కువగా మాట్లాడుతాడు. ఇంటెలిజెంట్. ఇంజినీరింగ్‌తో ఆగకుండా ఎంబీఏ కూడా చదివాడు. అనుకున్నది సాధించే వరకూ నిద్రపోడు. అభ్యుదయ భావాలు కలిగిన ఉన్నత వ్యక్తిత్వం అతనిది.

ఇలాంటి మనస్తత్వాలున్న వినయ్‌కీ అనూజకీ పెళ్ళి కుదిరింది. ఆమె వ్యక్తిత్వానికి అతను ఫిదా అయితే, అతని అందానికీ ఆశయాలకీ అనూజ ఆకర్షితురాలైంది.

తన ఏకైక చెల్లెలికి కట్నం ఇచ్చి, ఘనంగా పెళ్ళి చేయాలనుకున్నాడు శేఖర్. కట్నం సంగతి ప్రస్తావించగానే తను వరకట్నానికి వ్యతిరేకినంటూ అలాంటివేమీ వద్దన్నాడు వినయ్.

పెళ్ళి తర్వాత ఇద్దరిమధ్యా చిగురించిన ప్రేమ ఒకరిని వదిలి ఒకళ్ళు ఉండలేనంత గాఢంగా పెనవేసుకుంది. అన్యోన్యతకి కేరాఫ్ అడ్రస్ వీళ్ళిద్దరే అన్నట్టు ఉండేవాళ్ళు.

మొదటి పెళ్ళిరోజు ఘనంగా జరుపుకున్నారు.

★ ★ ★

రెండేళ్ళ తర్వాత...

చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రిజైన్ చేసి, మరో పార్ట్‌నర్‌తో కలిసి స్టార్టప్ కంపెనీ మొదలుపెట్టాడు వినయ్. కొన్నాళ్ళు బాగానే సాగింది. పార్ట్‌నర్ మోసం చేయడంతో... అతడిని తొలగించాడు. కానీ ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. డబ్బు కోసం ఏం చేయాలో తోచలేదు. ఇద్దరు ముగ్గురు ఫ్రెండ్స్‌ని అడిగాడు. ఎక్కడా వర్కవుట్ కాలేదు. అడిగిన వాళ్ళలో ఓ ఫ్రెండ్ సుజిత్...

"వినయ్, నువ్వు కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకుని... మంచివాడివి అనిపించుకున్నావు. వాళ్ళని నువ్వు కట్నం అడగలేదు సరే, వాళ్ళంతట వాళ్ళే ఇస్తామన్నా నువ్వు తీసుకోలేదు. దీనివల్ల నీకు



ఒరిగిందేమిటి? ఆ డబ్బుంటే నీకిప్పుడు కొంత ఉపయోగపడేది కదా. మీ బావమరిదిని ఇప్పుడు ఇవ్వమని అడుగు" అని చెప్పిన మాటలతో వినయ్ ఒక్క క్షణం ఆలోచనలోపడ్డాడు.

కానీ శేఖర్‌ని కట్నంగా డబ్బు అడగటానికి వినయ్ సంస్కారం అంగీకరించలేదు.

"అయితే ఒక పని చెయ్, కట్నంగా కాకపోతే ప్రస్తుతానికి అడ్జస్ట్ చెయ్యమని అడుగు. నీ బిజినెస్ పికప్ అవగానే తిరిగి ఇస్తానని చెప్పు" అన్నాడు.

అదే రోజు బ్యాంకులో కట్టాల్సిన డబ్బు... రెండు రోజుల్లో కట్టాలని నోటీసులు రావడంతో... వినయ్ చిరాగ్గా ఇంటికి వచ్చాడు. ఇల్లు తాళం వేసుంది.

తన కొలీగ్‌తో బయటికి వెళ్ళాననీ ఓ గంటలో వస్తాననీ వినయ్‌కి ఫోన్ చేసి చెప్పింది అనూజ. వినయ్ లోపలికెళ్ళి డ్రెస్ మార్చుకుని వచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఆ సమయంలో మరో బ్యాంక్ మేనేజర్ కూడా ఫోన్ చేశాడు.

డబ్బు కోసం బావమరిదికి ఫోన్ చేయాలనుకున్నాడు కానీ మనసు అంగీకరించలేదు.

అప్పుడే సుజిత్ ఫోన్ చేస్తే మాట్లాడుతూ...

"నువ్వు చెప్పిందే కరెక్ట్‌రా. పెద్ద త్యాగిలా నేనే ముందుచూపు లేకుండా కట్నం వద్దని శేఖర్ దగ్గర బింకాలు పోయాను. ఇప్పుడు ఆ డబ్బుంటే... ఈ సమస్యలు కొంత తీరేవి. కట్నం వద్దన్న నా అభ్యుదయభావాలు నన్ను ఏం ఉద్ధరించాయి?" అంటుంటే... అప్పుడే లోపలికి వచ్చిన అనూజ ఆ మాటల్ని వింది.

అనూజని చూసిన వినయ్... మాటలు ఆపేసి, ఫోన్ కట్ చేశాడు. అతనికి ఎదురుగా వచ్చి కూర్చుని, "ఓహో... కట్నం లేకుండా నన్ను పెళ్ళి చేసుకోవడం వల్ల నీకీరోజు కష్టాలు వచ్చాయా? మరి ఇన్నాళ్ళూ రోజుకోసారైనా 'నువ్వు నా ప్రేమ దేవతవీ... నిన్ను పెళ్లి చేసుకోవడం నా అదృష్టం... అదీ ఇదీ' అని ఆకాశానికి ఎత్తేశావే. అంటే, అవన్నీ అబద్ధాలేనా? బిజినెస్‌లో ఎవరో మోసం చేస్తే, నువ్వు నష్టపోయినదానికి నేనెలా కారణమవుతానో అర్థం కావడం లేదు. చేసుకున్న భార్య దగ్గర నిజాయతీగా లేకుండా... ఎవరో ఏదో చెప్పారని బయటపడబట్టి... నీ ఆదర్శాల ఆంతర్యం బట్టబయలైంది. అన్నయ్య ఇస్తానన్నప్పుడు తీసుకోకపోవడం తప్పైందా... అందుకని ఇప్పుడు కట్నం కావాలా?" అంది కోపంగా అనూజ.

"ఆహాఁ ఇప్పుడు ఎందుకనవూ? ఈ పెళ్ళి వల్ల లాభపడ్డది నువ్వూ మీ అన్నయ్యా. నష్టపోయింది నేను" అన్నాడు చిరాగ్గా.

"మా అన్నయ్య ఇస్తానన్నప్పుడు వద్దన్నది నువ్వు. అనవసరంగా ఎవరో చెప్పిన మాటలు విని, అన్నయ్య మీద ఇప్పుడు నిందలు వేయటానికి సిగ్గనిపించడం లేదా?"

ఆ తర్వాత ఇద్దరిమధ్యా మాటామాటా పెరిగి... అరుపులు మొదలయ్యాయి. సహనం కోల్పోయిన వినయ్ ఆమెపైకి చెయ్యెత్తాడు. అంతలో అరుపులు విని పక్క ఫ్లాట్ల వాళ్ళు వచ్చారు. ఆత్మాభిమానం దెబ్బతిన్న అనూజ సైలెంట్‌టైపోయి, గదిలోకి వెళ్ళింది. పెళ్ళయిన తర్వాత ఏనాడూ ఎడబాటు ఎరుగని ఇద్దరూ ఆ రాత్రి చెరో గదిలో పడుకున్నారు.

మర్నాడు ఉదయం వినయ్ నిద్ర లేవకముందే బయలుదేరి అన్నయ్య ఇంటికి వచ్చేసింది అనూజ.

★ ★ ★

గతం నుండి వర్తమానంలోకి వచ్చిన అనూజ... ఆలోచనలకి ఫుల్‌స్టాప్

(c) eenadu

పెట్టి నిద్రను ఆహ్వానించింది.

★ ★ ★

మరుసటి రోజు ఉదయం అన్నయ్య శేఖర్ ఆఫీస్‌కి వెళ్ళగానే... పద్మజ అడగటానికి ముందే జరిగిందంతా చెప్పింది అనూజ.

అంతా విన్నాక "నీ పరిస్థితి నాకు అర్థమైంది అనూ. భార్యాభర్తలిద్దరూ 'నువ్వా నేనా' అనుకుంటూ గొడవపడితే సమస్య పెద్దదవుతుందే తప్ప... పరిష్కారం దొరకదు. ఒక చెయ్యి లేచినప్పుడు మరో చెయ్యి వెనక్కి తగ్గితేనే శబ్దం రాదు. అలాకాక రెండు చేతులూ ఒకేసారి తలపడితే శబ్దం ఊరంతా వినిపిస్తుంది. ఒకటి అర్థం చేసుకో అనూ... ఆడవాళ్ళకంటే మగాళ్ళకి సహనం తక్కువ. అయిన దానికీ కాని దానికీ ఆవేశపడతారు. కోపం విసుగూ ప్రదర్శిస్తారు. మనం అలా కాదు- సహనం, శాంతం ఎక్కువ. అందుకే స్త్రీలని భూమాతతో పోలుస్తారు. మగవాళ్ళ కోపం తగ్గాక... నిదానంగా వాళ్ళకి అర్థమయ్యేలా వివరించి చెప్పాలి" అంది పద్మజ.

"అదేం న్యాయం వదినా? జరిగిన దాంట్లో నా తప్పేముంది?"

"భార్యాభర్తలు న్యాయాన్యాయాలు తర్కించుకుంటూ ఒకరిలో ఒకరు తప్పొప్పులు ఎంచుకుంటూపోతే గౌరవం పక్కకు తప్పుకుని ఘర్షణలు పెరుగుతాయి. ఒక్కసారి ఆలోచించు... చిన్నప్పుడు మనం ఎన్ని తప్పులు చేసినా వాటిని నాన్న వరకు పోనివ్వకుండా... మనం చెప్పేది ఓపిగ్గా విని, తప్పొప్పులు తెలియ చెప్పి సరిదిద్దేది అమ్మ. అలాగే మన ఇంటి సమస్యల్ని మనమే పరిష్కరించుకోవాలి. ఆవేశం తగ్గాక సహనంతో అనునయంగా చెప్తే ఏ భర్త అయినా తప్పకుండా వింటాడు."

పద్మజ మాటలు అనూజను మరింతగా ఆలోచింపజేశాయి.

"చూడు... వినయ్‌కి మీ అన్నయ్య కట్నం గురించి ఎన్నిసార్లు చెప్పినా... ఒక్కసారి కూడా అతను అంగీకరించలేదు. 'నాకు కట్నంకంటే అనూజే ముఖ్యం' అని నిన్ను పెళ్ళి చేసుకున్నాడు. ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు ఇలా మాట్లాడాడంటే... అతన్ని ఎవరో రెచ్చగొట్టి ఉంటారు, లేదా సమస్యలు అలా మాట్లాడించి ఉంటాయి. సహజంగా అతను అభ్యుదయ భావాలున్న వ్యక్తి. తప్పెక్కడో జరిగింది. తప్పెవరిలో ఉందో అతనికి తెలియ చెప్పాల్సిన బాధ్యత... భార్యగా నీదే. వినయ్ బిజినెస్ చేసేది అతని ఒక్కడి కోసమే కాదుగా. నువ్వూ బాగుండాలనీ రేపు పుట్టబోయే పిల్లలకు మంచి జీవితం ఇవ్వాలనే కదా. పార్ట్‌నర్ మోసం చేయడం, నష్టపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడటం... వీటన్నిటితో చిరాగ్గా ఉన్న సమయంలో... స్నేహితుడు చెప్పిన మాటలు అతనిపై ప్రభావం చూపించాయి. ఆ అసహనాన్ని నీ మీద చూపించేసరికి... నువ్వూ తగ్గకుండా మాటకు మాట ఎదురు చెప్పడంతో ఇద్దరిమధ్యా ఈగో తలెత్తి పరిస్థితి ఇంతవరకూ వచ్చింది. వంగని ఇనుముకంటే, వంగే గుణం గల బంగారానికి విలువ ఎక్కువ. ఇద్దరిలో ఏ ఒక్కరికి ఇబ్బంది వచ్చినా- అది మన ఇద్దరిదీ అనుకుని సహాయం చేసుకుంటూ సర్దుకుపోతే సమస్యలను మూడో కంటికి తెలియకుండా సాల్వ్ చేసుకోవచ్చు. నువ్వూ నేనూ వేరుకాదన్న భరోసా ఒకరికొకరు ఇచ్చుకుంటే ఇలాంటి గొడవలు చాలా అల్పంగా కనిపిస్తాయి" అంది పద్మజ.

అప్పటివరకూ సహనంగా వదిన మాటలు విన్న అనూజకి కళ్ళు చెమ్మగిల్లాయి.

"సాయంత్రం అన్నయ్య రాగానే చెప్పి, నేను వినయ్ దగ్గరికి వెళతాను వదినా"



అంది.

"ఇది కరెక్ట్" అని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది పద్మజ.

★ ★ ★

అనూజ లేని మూడు రాత్రులూ మూడు యుగాలుగా గడిపాడు వినయ్. మామూలుగా ప్రతిరోజూ ఆఫీస్‌కి వెళ్ళాక పని బిజీలో అనూజ సంగతి మర్చిపోయేవాడు. ఫోన్ చేయాలన్న సంగతి కూడా గుర్తుండేది కాదు. కానీ అనూజ అలా కాదు.. మధ్యాహ్నం ఫోన్ చేసి 'భోం చేశావా?' అని ఆప్యాయంగా ప్రతిరోజూ అడిగేది. కానీ ఇప్పుడు- తన భావాలూ ఆదర్శాలూ అన్నీ గాలికొదిలి, ఎవరో చెప్పిన మాటలు విని సంస్కారం కోల్పోయినందుకు ఎంతో ఫీలవుతున్నాడు. అనూజతో మాట్లాడి 72 గంటలు దాటింది. ఆపై ఆగలేకపోయాడు. ఆమెకీ అలాగే ఉండి ఉంటుందనుకున్నాడు. అనూజ మనసు అతనికి తెలుసు. 'ఈ గొడవలు ఇద్దరికీ గౌరవం కాదు, ఈ దూరం ఎవరికీ ఆనందం కాదు' అనుకుని... కారు తీసుకుని శేఖర్ ఇంటికి బయలుదేరుతుంటే... ఫోన్ మోగింది.

బిజినెస్ పార్ట్‌నర్ శ్రీకర్ ఫోన్ చేశాడు. వినయ్‌ని ఎక్కడికీ వెళ్ళొద్దంటూ తను వచ్చి కలుస్తానని చెప్పాడు. అరగంటలో శ్రీకర్ వచ్చాడు. వినయ్‌ని మోసం చేసినందుకు తనకు తగిన శాస్తి జరిగిందనీ, తన ఏడాది కొడుకు అకస్మాత్తుగా మరణించాడనీ చెప్పి... బిజినెస్‌లో తను వాడుకున్న డబ్బంతా తిరిగి వినయ్ బ్యాంక్ అకౌంట్లో జమ చేశానంటూ, క్షమించమని అడిగి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు వినయ్ మనసు ఎంతో ప్రశాంతంగా ఉంది. వెంటనే అనూజకి ఫోన్ చేసి విషయం చెప్పాడు. 'సమస్యలు ఎదురైనప్పుడే స్థిరంగా నిలబడాలి మనిషి. అలాంటిది నేను అంత సంస్కారహీనంగా ఎలా మాట్లాడానో తలచుకుంటేనే సిగ్గుగా ఉంది. దయచేసి నన్ను మన్నించు" అని అడుగుతుంటే.. అతని గొంతు జీరబోయింది. అనూజదీ అదే పరిస్థితి. భర్త మాట వినేసరికి సంతోషంతో కళ్ళు తడిసి మాటలు రాలేదు.

"అనూ... నువ్వక్కడే ఉండు. నేను వచ్చి నిన్ను తీసుకొచ్చుకుంటాను" అన్నాడు.

"త్వరగా" అంది ఉద్వేగంగా.

సరిగ్గా ఆ సమయంలో శేఖర్ ఇంటికి వచ్చాడు.

"అనూ, ఇదిగో... ఇందులో డబ్బుంది. తీసుకెళ్ళి వినయ్‌కి ఇవ్వు. ప్రస్తుతం అతనికి ఏవో ఇబ్బందులు ఉన్నాయట. దీనిని వాడుకోమని చెప్పు" అని ఇవ్వబోతుంటే...

"వద్దన్నయ్యా, ఇప్పుడు తనకి డబ్బుతో అవసరం లేదు. తన సమస్య పరిష్కారం అయ్యింది. నువ్వు వినయ్ దగ్గర డబ్బు ప్రస్తావన తేవద్దు" అంది.

"నీకెవరు చెప్పారు?"

"ఇప్పుడే ఫోన్ చేసి చెప్పాడు. నన్ను తీసుకెళ్ళడానికి వస్తున్నాడు" అంది.

మాటల్లోనే వినయ్ వచ్చాడు. శేఖర్ ఏం తెలియనట్టే ఊరుకున్నాడు. వినయ్ కూడా జరిగిన విషయం గురించి ఏమీ మాట్లాడలేదు. కాఫీ తాగాక అనూజ, వినయ్‌తో వెళ్ళబోతూ... పద్మజ దగ్గరకు వచ్చి "వెళ్ళొస్తా వదినా, థాంక్యూ" అంది.

ఆమెని దగ్గరకి తీసుకుని "భార్యాభర్తలు ఒకర్నొకరు అర్థం చేసుకుని కాస్త సర్దుబాటు ధోరణిని అలవరచుకుంటే ఎలాంటి సమస్యలైనా సమసి పోతాయి. అయినా చదువుకున్న దానివి, నీకు ఇవన్నీ చెప్పాల్సిన అవసరం లేదు. సంతోషంగా వెళ్ళిరా" అని ఇద్దరికీ చెయ్యూపింది పద్మజ సంతృప్తిగా. ★

(c) eenadu

టిఫిన్లు కొత్తగా..!

ఇడ్లీ, దోసె, ఉప్మా... వీటినే మార్చిమార్చి చేస్తుంటే ఎవరికైనా విసుగనిపిస్తుంది. అందులోనూ పిల్లలున్నారే... వాళ్లకి కొత్తదనం లేకపోతే కష్టమే. తినమని మారాం చేస్తారు. అందుకే కాస్త మార్పు చేసి చూడండిలా. ఇవి కొత్తగానూ ఉంటాయి... పోషకాలనీ అందిస్తాయి...



స్పైసీ రాగి పుట్టు

కావలసినవి: రాగిపిండి: రెండు కప్పులు, **ఉల్లిపాయ:** ఒకటి, **పచ్చిమిర్చి:** నాలుగు, **కొబ్బరికోరు:** మూడు చెంచాలు, **ఉప్పు:** తగినంత, **నీళ్లు:** సరిపడ, **తాలింపుకోసం: నూనె:** రెండు చెంచాలు, **ఆవాలు:** పావుచెంచా, **మినప్పప్పు:** పావుచెంచా, **జీలకర్ర:** పావుచెంచా, **కరివేపాకు:** రెండు రెమ్మలు, **ఇంగువ:** చిటికెడు.

తయారీ విధానం: రాగిపిండిలో తగినంత ఉప్పూ, పెద్ద చెంచా నీళ్లూ వేసి బాగా కలపాలి. పిండిని పిడికిట్లోకి తీసుకుంటే పొడిలా రాలిపోకుండా, ఒక ముద్దలా అరచేతిలో ఉండేలా చూడాలి. ఇడ్లీ కుక్కర్‌లో తగినన్ని నీళ్లు పోసుకుని ఇడ్లీ పాత్రలో... రాగిపిండిని పలచగా పరుచుకుని, పదినిమిషాలు ఆవిరిమీద ఉడికించుకోవాలి. అది చల్లారేలోపు... స్టవ్‌పైన కడాయి పెట్టి నూనెవేసి ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, ఇంగువ, కరివేపాకు వేసి చిటపటలాడుతున్నప్పుడు ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి కూడా వేసి బాగా వేయించుకున్నాక... ఆవిరిమీద ఉడికించిన రాగిపిండి కూడా వేసి కలుపుకోవాలి. చివరిగా కొబ్బరికోరు కూడా వేసి కలిపితే రుచికరమైన రాగిపుట్టు సిద్ధం.

బన్ దోసె

కావలసినవి: బొంబాయి రవ్వ: కప్పు, **పెరుగు:** అరకప్పు, **ఉప్పు:** తగినంత, **నూనె:** రెండు చెంచాలు, **తాలింపుకోసం: నూనె:** ఒకటిన్నర చెంచా, **ఇంగువ:** పావుచెంచా, **ఆవాలు:** అరచెంచా, **పచ్చిమిర్చి:** రెండు, **అల్లం తరుగు:** రెండు చెంచాలు, **ఉల్లిపాయముక్కలు:** పావుకప్పు, **కరివేపాకు:** రెండు రెమ్మలు, **కొత్తిమీర తరుగు:** రెండు చెంచాలు, **బేకింగ్ సోడా:** చిటికెడు, **నూనె:** తగినంత.

తయారీ విధానం: ఒక గిన్నెలో బొంబాయి రవ్వ, పెరుగు, తగినంత ఉప్పు వేసి బాగా కలిపి పావుగంట పక్కన పెట్టేయాలి. ఒక కడాయిలో రెండు చెంచాల నూనె వేసుకుని వేడెక్కాక అందులో ఆవాలు, పచ్చిమిర్చి, అల్లం తరుగు, ఉల్లిపాయముక్కలు, కరివేపాకు, ఇంగువ వేసి మంచి సువాసన వచ్చేంతవరకూ వేయించుకోవాలి. ఈ తాలింపుని బొంబాయి రవ్వ, పెరుగు మిశ్రమంలో వేసి చివరిగా బేకింగ్‌సోడా కూడా వేసి కలపాలి. పిండి మరీ గట్టిగా, పలచగా కాకుండా కొద్దిగా నీళ్లు పోసుకోవచ్చు. స్టవ్‌పైన పాన్‌పెట్టి వేడెక్కాక నూనె వేసి మందంగా ఉండే అట్టులా వేసుకుని పైన మూత పెట్టేయాలి. ఒకవైపు ఎర్రగా కాలాక తిరగేసి మరోవైపు కూడా కాల్చుకుంటే బన్‌దోసె సిద్ధం.



ఆలూ మసాలా పనియారం

కావలసినవి: బొంబాయి రవ్వ: కప్పు, **పెరుగు:** అరకప్పు, **సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు:** చెంచా, **అల్లం తరుగు:** చెంచా, **నూనె:** రెండు చెంచాలు, **ఉప్పు:** తగినంత, **బేకింగ్ సోడా:** పావుచెంచా **స్టఫింగ్ కోసం:** బంగాళాదుంపలు: రెండు, **జీలకర్ర:** అరచెంచా, **పచ్చిమిర్చి తరుగు:** చెంచా, **కారం:** అరచెంచా, **గరంమసాలా:** అరచెంచా, **ఆమ్‌చూర్ పొడి:** అరచెంచా, **కొత్తిమీర తరుగు:** అరచెంచా, **ఉప్పు:** తగినంత.



తయారీ విధానం: బంగాళాదుంపల్ని కుక్కర్‌లో మెత్తగా ఉడికించుకుని అందులో స్టఫింగ్ కోసం పెట్టుకున్న పదార్థాలన్నింటినీ కలుపుకుని చిన్నచిన్న ఉండల్లా చేసుకోవాలి. ఒక పాత్రలో బొంబాయి రవ్వ, పెరుగు, ఉప్పు, ఉల్లిపాయముక్కలు, అల్లం తరుగు వేసి బాగా కలిపి పావుగంట పక్కన పెట్టేయాలి. చివరిగా బేకింగ్‌సోడా వేసి ఒకసారి కలిపి పనియారం పిండి తయారుచేసుకోవాలి. గుంట పనియారమ్ తయారుచేసే పాత్ర తీసుకుని స్టవ్‌పైన పెట్టుకుని వేడెక్కాక నూనె రాసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. చిన్నమంటపైన ఉంచి ఒక్కో బంగాళాదుంప ముద్దనీ బొంబాయిరవ్వలో ముంచి పనియారం పాత్రలో వేసి ముదురు గోధుమరంగులోకి వచ్చేంతవరకూ అన్నివైపులా కాల్చి తీసుకోవాలి. రుచికరమైన ఆలూ మసాలా పనియారం సిద్ధం.

బ్రెడ్ వడ

కావలసినవి: బ్రెడ్ స్లైసులు: నాలుగు, **బియ్యప్పిండి:** రెండు చెంచాలు, **బేకింగ్ సోడా:** చిటికెడు, **నీళ్లు:** మూడు చెంచాలు, **ఉప్పు:** తగినంత, **ఉల్లిపాయముక్కలు:** మూడు చెంచాలు, **సన్నగా తరిగిన పచ్చిమిర్చి:** చెంచా, **అల్లం తరుగు:** చెంచాన్నర, **కొత్తిమీర తరుగు:** చెంచా, **నూనె:** కప్పు.


తయారీ విధానం: అంచులు తీసేసి బ్రెడ్‌స్లైసులని పొడిలా చేసుకోవాలి. ఈ పొడిలో బియ్యప్పిండి, ఉప్పు, ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి, అల్లం తరుగు, కొత్తిమీర, బేకింగ్‌సోడా వేసి నీళ్లు చల్లుకుంటూ గారెల పిండిలా గట్టిగా కలపాలి. స్టవ్‌పైన కడాయిపెట్టి నూనె పోసి, వేడెక్కాక కొద్దికొద్దిగా పిండి తీసుకుని మధ్యలో చిల్లుపెట్టుకుని గారెల్లా వేయించుకోవడమే. కరకరలాడుతూ ఈ ఇన్‌స్టెంట్ వడలు భలే రుచిగా ఉంటాయి.



(c) eenadu

దారి కనుక్కోండి

కుందేలుకు ఓ చోట క్యారెట్లు కనిపించాయి. మరోవైపు జిత్తులమారి నక్కేమో దాని కోసం కాచుకొని కూర్చుంది. ఆ నక్కకు దొరక్కుండా, క్యారెట్ల దగ్గరికెళ్లేందుకు కుందేలుకు మీరు దారి చూపరూ!



దాగుడుమూతలు

పిల్లలంతా కలిసి ఎంచక్కా టీవీ చూస్తున్నారు కదూ! ఈ చిత్రంలో కింద వరసలోని బొమ్మలు దాగున్నాయి. ఎక్కడున్నాయో వెతికి పట్టుకోండి మరి!



బొమ్మ గీద్దాం



అందుకే అలా రాశా

టీచర్: నువ్వు బాగా చదువుతావు కదా... మరి ఈసారి పరీక్షలో జవాబులన్నీ అర్థం కాకుండా రాశావేంటీ..

బన్నీ: నా పక్కన కూర్చున్న చింటూ అదేపనిగా నా పేపర్‌లోకి తొంగి చూస్తుంటే.. వాడు కాపీ కొట్టకుండా అలా రాశా టీచర్.

క్లూ తెలుసా

టీచర్: వేమన శతకం రాసింది ఎవరో చెప్పు?


బంటీ: తెలియదు టీచర్

టీచర్: ప్రశ్నలోనే క్లూ ఉంది ఆలోచించు... నువ్వే చెప్పగలవు

బంటీ: శతకం గారు టీచర్.

తేడాలేంటి?

కింది బొమ్మల మధ్య ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?




(c) eenadu

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడున్న బొమ్మల్లో ఒక్కటి తప్ప మిగతావన్నీ రెండుసార్లు ఉన్నాయి. మరి ఆ ఒక్కటి ఏదో గుర్తించండి.





చెప్పగలరా?

పిల్లలంతా హాయిగా పిక్నిక్‌కి వెళ్లారు కదూ! బొమ్మలో ఆంగ్ల అక్షరం 'B'తో ప్రారంభమయ్యే కొన్ని వస్తువులూ, ఆహార పదార్థాలూ ఉన్నాయి. అవేంటో చెప్పండి మరి!



జింక మంత్రం!

రామాపురం వచ్చిన ఓ సాధువుకు భీమయ్య అనే పేద వాడు నమస్కరించి 'అయ్యా.. నాకెవరూ లేరు. ఏ బతుకుతెరువూ లేదు. నన్ను మీ శిష్యుడిగా అంగీకరించండి' అన్నాడు. అతణ్ణి శిష్యుడిగా తీసుకునే ఉద్దేశం లేదా సాధువుకు. ఇంతలో ఒక జింక దాని శరీరాన్ని చెట్టుకేసి రుద్దుకోవడం కనిపించింది. భీమయ్యకు దాన్ని చూపించి, 'అదేం చేస్తోంది' అని అడిగాడు. 'ఒంటిని చెట్టుకేసి రుద్దుకుంటోంది' అని చెప్పాడతను. 'నువ్వు రుద్దేది నాకెరుకే.. ఈ మంత్రాన్ని మూడుసార్లు చెప్పు' అన్నాడు సాధువు. అలాగే చేశాడు భీమయ్య. 'ఇప్పుడది ఏం చేస్తోంది?' అడిగాడు సాధువు. వెళ్లిపోతోం దనడంతో 'నువ్వు పొయ్యేది నాకెరుకే..' అని మూడుసార్లు చెప్పమన్నాడు సాధువు. అలాగే చెప్పాడు. 'ఈ జింక మంత్రాన్ని జపిస్తుంటే కష్టాలన్నీ పోతాయి' అన్నాడు సాధువు.



సరేనంటూ ఆ మంత్రాన్ని పఠిస్తూ రాజధానికి చేరుకున్నాడు భీమయ్య. రాజుకు వారసులు లేకపోవడంతో, తాను గద్దెనెక్కే అవకాశం కోసం ఎదురు చూడసాగాడు మంత్రి. ఒకసారి రాజుకు రోజూ గడ్డం గీసే పాపయ్యను మంత్రి పిలిచి 'రేపు నువ్వు గడ్డం గీసేటప్పుడు రాజు గారి మెడను కోసెయ్యి.. అడిగినంత డబ్బిస్తాను' అన్నాడు. 'దొరికిపోతే నా తల తీసేస్తారయ్యా..' అంటూ భయంగా అన్నాడు పాపయ్య. 'రాజుగారు పోతే తర్వాత ఆ స్థానంలోకి వచ్చేది నేనే కదా..' అని మంత్రి అనడంతో సరే నన్నాడతను. మరుసటి రోజు కోట దగ్గర కూర్చొని కత్తి నూరుతుండగా.. 'నువ్వు రుద్దేది నాకెరుకే..' అంటూ జింక మంత్రం జపిస్తూ అటుగా వచ్చాడు భీమయ్య. ఆ మాటలకు హడలిపోయిన పాపయ్య.. కత్తిని సంచిలో పెట్టుకొని పారిపోయేందుకు సిద్ధమవడంతో.. 'నువ్వు పొయ్యేది నాకెరుకే..' అన్నాడు భీమయ్య. పాపయ్య పారిపోవడాన్ని గమనించిన రాజు.. బంధించి సభకు తీసుకురమ్మని ఆదేశించాడు. రాజు సభలో ఉండగా పాపయ్యను ప్రవేశపెట్టారు భటులు. ఎందుకు పరుగెత్తుతున్నావని రాజు ప్రశ్నించడంతో.. కుట్ర విషయం బయట పెట్టాడతను. మంత్రికి మరణశిక్ష, పాపయ్యకు దేశ బహిష్కరణ విధించిన రాజు.. తెలియకుండానే తన ప్రాణాలు కాపాడిన భీమయ్యకు ఆస్థానంలో కొలువు ఇచ్చాడు. జింక మంత్రం తన కష్టాలు తీర్చిందనుకుంటూ ఆనందపడ్డాడు భీమయ్య.

రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. నీళ్ల సీసా స్థానం 2. చెయ్యెత్తిన బాబు చేతిలోని పెన్సిల్ 3. కుండీలోని మొక్క 4. కిటికీ 5. చివరనున్న బాబు జుట్టు 6. ముందున్న బాబు చొక్కా చేతులు 7. కళ్లద్దాలు పెట్టుకున్న బాబు ఎదుట పుస్తకం 8. మూడో వరసలోని బాబు చొక్కా రంగు.

దాగుడుమూతలు: బాబు జుట్టులో బుజ్జి పిల్లి, కుండీ కింద స్కేలు, సీతాకోకచిలుక రెక్కల్లో పిజ్జా ముక్క, డోర్ హ్యాండిల్‌గా టూత్‌బ్రష్, విమానం కిటికీలుగా పిల్లనగ్రోవి, పెద్ద బంతిలో గొడుగు, టెడ్డీ ముక్కుగా డోనట్, కుర్చీ అంచులో బూమరాంగ్.


చెప్పగలరా?: Biscuits, Banana, Burger, Ball, Bird, Basket, Bag, Bread.

ఆ ఒక్కటి ఏది?: 8

(c) eenadu

సమీక్ష


చమత్కార గీత!



పెళ్ళంటే మూడుముళ్ళు మాత్రమేనా, బోలెడు నవ్వులు కూడా! ఎదుర్కోళ్ళు, కాశీయాత్ర, తలంబ్రాలూ, అరుంధతీ నక్షత్రమూ, అప్పగింతలూ, విందు భోజనాలూ, ఆఖర్న శోభనమూ... ఇలా పెళ్లి సందడిలోని ఏ కోణాన్నీ వదలకుండా దాదాపు నూట నలభై హాస్యరేఖలతో 'పెళ్లి కార్టూన్లు' పుస్తకాన్ని రూపొందించారు సరసి. ఇదంతా కల్యాణ మండపం వ్యవహారమైతే... సాంస్కృతిక కళా వేదికల సాక్షిగా పురుడు పోసుకునే హాస్యాన్ని 'సంగీతం కార్టూన్లు' పేరుతో అందిస్తున్నారు. ఇందులో ఇంటింటి కూనిరాగాల్నీ వదల్లేదు. సంసార సరిగమల్లోంచి కూడా చిక్కని హాస్యాన్ని పండించారు.

పెళ్లి కార్టూన్లు, సంగీతం కార్టూన్లు; కార్టూనిస్టు: సరసి
పేజీలు: 148, వెల: రూ.200 (ఒక్కొక్కటి), ప్రతులకు: ఫోన్: 9000413413


రాజాధిరాజు...



దానధర్మాల వల్ల గత వైభవాన్ని కోల్పోయి, ఉన్న కొద్దిపాటి భూములూ కేసుల్లో చిక్కుకుపోయి... పాతను మరువలేకా, కొత్తను ఆమోదించలేకా సతమతమయ్యే ఓ రాజుగారి కష్టసుఖాలు నేపథ్యంగా సాగుతుందీ నవల. ఆ మేడలోకి మేనేజరు హోదాలో అడుగుపెట్టే విశ్వనాథ్‌కు ఎదురయ్యే అనుభవాలూ, అతణ్ని ఉక్కిరిబిక్కిరి చేసే సంఘటనలూ... పాఠకుడిలో ఉత్కంఠను కలిగిస్తాయి. రాజుగారి మంచి కోసం ఆ యువకుడు చేసే ప్రయత్నాలు అపరాధ పరిశోధన సాహిత్యాన్ని గుర్తుకు తెస్తాయి.

అనగనగా ఒక రాజు (నవల); రచన: **పొత్తూరి విజయలక్ష్మి**
పేజీలు: 232, వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు


స్ఫూర్తి... దీప్తి!



ఒక బిడ్డను పెంచి పెద్దచేయడంలో మొత్తంగా సమాజం భాగం అవుతుందని అంటారు. మన లక్ష్యం బలమైంది అయినప్పుడు, సృష్టిలోని సమస్త శక్తులూ చేతులు కలిపి మరీ మనకు సాయం చేస్తాయనీ చెబుతారు. తెలంగాణలోని కల్లెడ అనే గ్రామంలో పుట్టి... ప్యారిస్‌లోని పారా ఒలింపిక్స్ వేదిక మీద కాంస్యం అందుకునే వరకూ దీప్తి జీవితంలో జరిగిన సంఘటనల్ని చదువుతున్నప్పుడు ఈ రెండు మాటలూ నిజమే అనిపిస్తాయి. తను పేదరికాన్ని పట్టించుకోలేదు. వైకల్యాన్ని అవరోధంగా భావించలేదు. ఆ గుండెబలమే 'రన్ దీప్తి రన్'కు కథావస్తువు. యండమూరి మార్కు వాక్యాలు పాఠకుల్లో విజయకాంక్షను రగిలిస్తాయి.

రన్ దీప్తి రన్; రచన: యండమూరి వీరేంద్రనాథ్
పేజీలు: 191, వెల: రూ.195
ప్రతులకు:ప్రధాన పుస్తక కేంద్రాలు

అమ్మకు జేజేలు



తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ జ్ఞాపకాల బొమ్మల కొలువు 'అమ్మ'. ఇది అచ్చమైన మాతృత్వ మమకారపు కథ. ఈ పుస్తకం ద్వారా... ఆ అమ్మలోని మొండి రైతు గురించి తెలుసుకుంటాం. ఆమెలోని పాకశాస్త్ర నిపుణురాలిని పరిచయం చేసుకుంటాం. ఎవరి రుణమూ ఉంచుకోకూడదని భావించే కర్మసిద్ధాంతిని దర్శించుకుంటాం. ఏ పొగాకుతోనో, మద్యంతోనో పోలిస్తే పుస్తకాలు కొనే అలవాటు వల్ల ఏ ఇబ్బందీ ఉండదని మురిసిపోయే బోళా మనిషినీ కళ్లారా చూస్తాం. పాలిచ్చిన చేతులతోనే తన బిడ్డకు కవితావస్తువునూ అందించిన ఆ నిరక్షర సరస్వతి పేరు పెరుమాయి అయితే కావచ్చు కానీ, ఓ దశలో సృష్టిలోని సకల మాతృగణానికీ ప్రతినిధిలా అనిపిస్తుందామె. ఏదో ఓ పేజీలో మన అమ్మ గురించీ చదువుతున్న భావన కలుగుతుంది. అరుణ ప్రసాద్ అనువాదమూ బావుంది.

అమ్మ; రచన: పెరుమాళ్ మురుగన్, అనువాదం: అరుణ ప్రసాద్
పేజీలు: 136, వెల: రూ.150 ప్రతులకు: ఫోన్: 9381559238

బుక్ షెల్ఫ్

సి.నారాయణరెడ్డి కథా కావ్య సమాలోచనం
రచన: అనుమాండ్ల భూమయ్య
పేజీలు: 423, వెల: రూ.400
ప్రతులకు: ఫోన్: 8897073999

మూడు కోళ్లను అరెస్టు చేశాం సార్!
(హాస్య కథలు)
రచన: సింహప్రసాద్
పేజీలు: 195, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 7893467516

నా జీవన గీతం (కవిత్వం)
రచన: సుంకరి కృష్ణప్రసాద్
పేజీలు: 158, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 8074197852

రాజహంస (నవల)
రచన: డా. దిట్టకవి శ్యామలాదేవి
పేజీలు: 360, వెల: రూ.275
ప్రతులకు: ఫోన్: 9700332443

నిశ్శబ్ద మాధుర్యం (కవిత్వం)
రచన: గుడ్లదొన సాయి చంద్రశేఖర్
పేజీలు: 154, వెల: రూ.150
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

తెలంగాణ తొలితరం కథకులు-కథన రీతులు
రచన: కె.పి.అశోక్‌కుమార్
పేజీలు: 280, వెల: రూ.280
ప్రతులకు: ఫోన్: 9490099373

రాజీవ్ హత్య కారణాలు-జరిగిన తీరు- నేర పరిశోధన
రచన: ఎమ్బీయస్ ప్రసాద్
పేజీలు: 240, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9000413413

రంగులద్దని కుంచెలు (కవిత్వం)
రచన: సత్య చాగంటి
పేజీలు: 120, వెల: రూ.120
ప్రతులకు: ఫోన్: 9948834608

తెలుగు చలనచిత్ర వికాసం (1940-1990)
రచన: డాక్టర్ దేశిరాజు లక్ష్మీనరసింహారావు
పేజీలు: 400, వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 0866-2436643

(c) eenadu

రాశి ఫలం

గ్రహబలం
(అక్టోబరు 26 - నవంబరు 1)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

లక్ష్యంపైనే గురి పెట్టండి. వైఫల్యాలు నేర్పిన పాఠాలను మరిచిపోకండి. కాలం కొంత వ్యతిరేకంగా ఉంది కాబట్టి, ఆచితూచి అడుగు వేయాలి. ఆరంభశూరత్వం పనికిరాదు. కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. ఆత్మీయుల విషయంలో అపోహలకు తావివ్వకండి. వాహన ప్రయాణంలో అతి వేగాన్ని నియంత్రించండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి అనువైన సమయం. కొత్త ప్రయత్నాలు సఫలం అవుతాయి. పదవీయోగం ఉంది. భూలాభం సూచితం. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. పెద్దల ఆశీస్సులు అందుతాయి. వారాంతంలో ఓ శుభవార్త వింటారు. పిల్లలకు మంచి జరుగుతుంది. మహాలక్ష్మిని పూజించండి.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

మనోబలంతో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తారు. అదృష్టం వరిస్తుంది. ఎంతోకాలం నుంచీ ఎదురుచూస్తున్న ఓ పని ఈవారం పూర్తవుతుంది. సృజనాత్మకతతో కొన్ని సమస్యల్ని పరిష్కరిస్తారు. మీ కారణంగా కొందరికి మేలు జరుగుతుంది. వ్యాపారంలో కలిసొస్తుంది. ఉద్యోగ నిర్వహణలో అశ్రద్ధ వద్దు. కొత్త ప్రయోగాలకు ఇది సమయం కాదు. అష్టలక్ష్మిని ధ్యానించండి.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఆర్థిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. పొదుపు-మదుపు ప్రణాళికకు ప్రాధాన్యం ఇవ్వండి. ఒత్తిడికి దూరంగా ఉండండి. మొహమాటం వల్ల సమస్యలు చుట్టుముట్టే ఆస్కారం ఉంది. మిత భాషణం ఉత్తమం. కొందరు కావాలనే ఇబ్బందులు సృష్టిస్తారు. లౌక్యంతో పరిష్కరించుకోండి. వ్యాపార వ్యవహారాల్లో జాగ్రత్తగా వ్యవహరించండి. నవగ్రహాలను పూజించండి.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఉద్యోగంలో కలిసొస్తుంది. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటారు. కొత్త ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. అసాధ్యంగా భావించిన పని కూడా సులభసాధ్యం అవుతుంది. వ్యాపారాన్ని మరింత విస్తరిస్తారు. ఇతరులపైన ఆధారపడకండి. గతంలోని పెట్టుబడులు రాబడిని అందిస్తాయి. దుర్గామాతను ధ్యానించండి.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

మనోబలాన్ని పెంచుకుంటారు. లక్ష్యం పట్ల నిబద్ధత అవసరం. మీదైన ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. సంపదల్ని సృష్టించుకునే అవకాశం తలుపుతడుతుంది. ఆశావాదంతో దాన్ని సద్వినియోగం చేసుకోండి. రుణాలకు దూరంగా ఉండండి. గతంలోని ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. సూర్యనారాయణ మూర్తిని పూజించండి.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపార ప్రయోజనాలు సిద్ధిస్తాయి. మీదైన ప్రతిభతో అందర్నీ మెప్పిస్తారు. కొత్త కార్యక్రమాలు లాభదాయకం. దీర్ఘకాలిక ప్రయత్నాల్లో పురోగతి ఉంటుంది. అదృష్టయోగం సూచితం. కొందరికి మేలు చేయబోతే కీడు జరిగే ఆస్కారం ఉంది. చుట్టూ ఉన్నవారితో జాగ్రత్త. ఉద్యోగ బాధ్యతల్ని తేలిగ్గా తీసుకోకండి. సూర్యుడిని ధ్యానించండి.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

విజయాలు వరిస్తాయి. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ఉద్యోగుల సంపాదన పెరుగుతుంది. వ్యాపారులు లాభాలను అందుకుంటారు. చిన్నచిన్న చికాకులను పట్టించుకోకండి. విధి నిర్వహణలో ఒత్తిడికి గురికాకండి. బంధుమిత్రుల వల్ల మేలు కలుగుతుంది. వారం మధ్యలో శుభవార్త వింటారు. సూర్యుడిని స్మరించుకోండి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

శ్రమకు తగిన ప్రతిఫలం అందుతుంది. సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తారు. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. స్థిరాస్తుల కొనుగోలు విషయంలో స్పష్టత వస్తుంది. మొత్తంగా ఆర్థిక ఫలితాలు మిశ్రమంగా ఉంటాయి. కొన్ని నిర్ణయాలను పునరాలోచించుకోవాలి. విష్ణు సహస్రనామం పఠించండి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు కొత్త కొలువులు లభిస్తాయి. పదవీయోగం ఉంది. మీ కృషిని పెద్దలు గుర్తిస్తారు. గతంలోని ఇబ్బందులు తొలగిపోతాయి. సమాజంలో గౌరవం పెరుగుతుంది. నలుగుర్నీ మెప్పిస్తారు. జీవితంలో స్థిరత్వం ఏర్పడుతుంది. స్థిరాస్తులు వృద్ధి చెందుతాయి. ఇతరులపైన ఆధారపడకండి. లక్ష్మీదేవిని ఉపాసించండి.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఆత్మబలంతో అనుకున్నది సాధిస్తారు. పరిస్థితులకు తగినట్టు ప్రణాళికను రచించుకోండి. ముఖ్య వ్యవహారాల్లో లౌక్యం అవసరం. వృత్తి ఉద్యోగాల్లో ఆటంకాలను అధిగమిస్తారు. ఆర్థికంగా మంచి ఫలితాలు సాధిస్తారు. మొహమాటానికిపోయి రుణాల బారిన పడకండి. ఆత్మీయుల విషయంలో అపార్థాలకు తావివ్వకండి. ఆరోగ్యం జాగ్రత్త. నవగ్రహ శ్లోకాలను పఠించండి.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మనోబలంతో కొత్త పనులను ప్రారంభించండి. సరైన ప్రణాళికతో ఒత్తిడిని తగ్గించుకోండి. ప్రతి అడుగూ ఆచితూచి వేయాలి. కుటుంబ సభ్యుల సలహాలు మంచి చేస్తాయి. బుద్ధిబలంతో వ్యాపార సమస్యల్ని అధిగమిస్తారు. వ్యతిరేక వాతావరణంలోనూ ప్రశాంతంగా వ్యవహరించండి. భారీ లక్ష్యాల జోలికి వెళ్లకండి. నవగ్రహ శ్లోకాలను పఠించండి.


(c) eenadu

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. అత్రి మహర్షి భార్య... అసూయ లేనిది అని అర్థం (4)
4. పద్మం (4)
6. ఆదివారానికి ముందు..? (4)
9. ఒక పువ్వు... దాని పేరూ రంగూ ఒకటే (5)
12. అతివ (3)
14. వాగ్దానం (2)
15. లత, తీగ (3)
16. వితరణం, అర్పణం (2)
17. తిరస్కరణ, ధిక్కారం (4)
19. జానకి (2)
20. సగం గుర్తు (1)
21. జడ, వేణి (2)
23. పాంగోలిన్, కినుక వహించు (3)
25. గడచిపోయిన కాలం (2)
27. కయ్యాలకోరు (5)
30. నిశ, యామిని (3)
32. వణకు, కంపం (2)
33. కనకమే కానీ చివరి అక్షరం మొదట చేరింది (3)
34. తామర (3)
35. అధికం, అపారం (3)
37. అమాత్యుడు (2)
38. కలువ (4)
40. భ్రమరం (3)
41. సుతుడు (3)
42. భుజించు (2)
44. ఆచార్యుడు (3)
46. వసంతం; ఉన్మొత్త (3)
48. తిరగబడిన తాళం (2)
50. రేయి (3)
51. అడ్డం 20తో హయం (1)
52. వెనకటి రోజుల్లో బడిలో మాస్టారును ఇలా పిలిచేవారు (3)



నిలువు

1. నాగలి (3)
2. ఆదిత్యుడి వెలుగు (4)
3. కీడు (2)
4. పడవ నడిపేవాడు (3)
5. లజ్జ (2)
6. బాణం (2)
7. పొట్టి, గిడస (3)
8. పరిమళం (3)
10. అనారోగ్యం (3)
11. మేక... ఉర్దూ పదం (3)
13. వనం, అడవి (2)
14. చేదోడు, మద్దతు (3)
16. సేవకులు (3)
18. వెండి (3)
19. గర్భిణులకు చేసే వేడుక (3)
22. మేకు (2)
23. శత్రువు, వైరి (2)
24. కొంతమంది నిద్రలో చేసే శబ్దం (3)
25. భూమి లోపల ఖనిజాలు దొరికేచోటు (2)
26. ఆధ్యాత్మిక సాధనలో... 41 నుంచి 49 రోజులు (3)
28. పౌర్ణమి (3)
29. పాండురాజు రెండో భార్య (2)
31. సీతాదేవి తండ్రి (4)
32. నలచక్రవర్తి భార్య (4)
33. మోసగాడు, కపటి (2)
34. స్వప్నం (2)
35. ప్రశ్నించు (3)
36. నూలు, పోగు (3)
37. అవివేకి, బుద్ధిహీనుడు (4)
39. పొగడపువ్వు (3)
41. కొనుగోలు చేయం (2)
43. తిలలు (3)
45. ముని (2)
47. చెంత, పక్కన (2)
49. ఉష్ణం, వేడిమి (2)

సుడొకు

	9		6	7			4	3
				3			2	
4	1	3			9			
		9			7	6	5	
	5						8	
	4	8	2			3		
			7			5	3	4
	3			6				
1	8			5	3		7	

గతవారం సమాధానాలు

పదకేళి


1 అ	లు	2 మ	3 గ	లు		4 ప		5 క	ని	6 క	7 రం
త్త		8 ను	తి		9 వెం	డి	కొం	డ		10 వి	భ
11 నా	గ	మ		12 వ		యా		13 వ	14 ని	త	
దం		15 రా	ధ		16 క	లు	17 వ		పు		18 రా
	19 కా	లు		20 వె	ల		21 ని	22 సి		23 శ	వం
24 వీ	ను		25 శ		26 హ	యం		27 నీ	28 హా	రం	
	29 క	30 లా	ని	31 జ	మా		32 సా	వా	సం		33 క్షం
34 మె		రీ		మా		35 డ		లి		36 మా	
37 రు	క్మం		38 శి	ఖ	రం		39 అ		40 రా	జీ	41 వం
పు		42 క్త		ర్బు		43 ప్ర	తి	బిం	బం		దో
	44 పా		45 అ	లు	46 సు		వ		47 దు	హి	త
48 వే	ప	చె	ట్టు		49 మం	చం		50 ఊ	లు		పు

సుడొకు


3	5	8	2	1	7	4	6	9
2	7	9	3	4	6	5	8	1
4	6	1	5	8	9	2	7	3
1	2	4	9	6	5	7	3	8
6	8	5	7	3	4	1	9	2
9	3	7	1	2	8	6	5	4
5	9	3	4	7	1	8	2	6
8	1	2	6	5	3	9	4	7
7	4	6	8	9	2	3	1	5

A B C D E F 1 2 3

(c) eenadu



కొండాకోనల్లో... కుండ హోటల్లో!













టూర్‌లో సేదతీరడానికి హోటళ్లు బుక్ చేసుకుంటాం. కానీ ఆ బస ఏర్పాట్లే అద్భుతమైన విహార అనుభూతుల్ని మిగిలిస్తే- పర్యటకులకు అంతకన్నా ఇంకేం కావాలి. ఆ సరదా తీర్చడానికే ఈమధ్య కొండాకోనల్లో, సముద్రపు అంచుల్లో, పచ్చటి చెట్లలో రిసార్టులు కడుతున్నారు. కాస్త వైవిధ్యంగా ఆలోచిస్తూ, ఆకట్టుకునే ఆర్కిటెక్చర్‌కు రూపమిస్తున్నారు. జార్జియాలోని షాలోరీ గ్రామంలో ప్రకృతి అందాల నడుమ కుండల ఆకారాల్లో నిర్మించిన ఈ క్విరెబీ హోటల్ కూడా సరిగ్గా అలాంటిదే. కుండల ఆకృతిలో ట్రెడిషనల్ టచ్ ఇస్తూనే ఈ లగ్జరీ గెస్ట్ రూమ్స్‌ను తీర్చిదిద్దారు. విలాసవంతమైన సౌకర్యాలతోపాటు స్విమ్మింగ్ పూల్, రెస్టరంట్, స్పా, గేమింగ్ జోన్స్‌లాంటివన్నీ ఉంటాయి ఇక్కడ. పలు వరుసల్లో కట్టిన ఈ పాట్ హోటళ్లలో ఉంటూ, రాత్రిపూట ఆరుబయట దృశ్యాల్నీ ఎంజాయ్ చేస్తుంటారు సందర్శకులంతా!

(c) eenadu



నింగిలోని తారలు హరివిల్లు వర్ణాలను అద్దుకుని నేలమీద పోగుపడినట్లుగా ఉన్న
ఈ చిత్రాన్ని చూస్తుంటే- ఆ అందానికి మనసు ఫిదా అయిపోవడం లేదూ!
బ్రూస్ మన్రో అనే కళాకారుడి ఆలోచనకు రూపమే ఇక్కడ కనిపిస్తున్న 'ఫీల్డ్ ఆఫ్ లైట్స్'.
అమెరికాలోని సెన్సోరియోలోని విశాలమైన మైదానంలో వేల కొద్దీ
ఫైబర్ ఆప్టిక్ లైట్లతో దీన్ని ఏర్పాటుచేశారు.

(c) eenadu